Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
PRAJA TELEVISION The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541
ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 25 | సంచిక : 155 | హైదరాబాద్ | మంగళవారం 10 జూన్ 2025 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR




## 27 మంది ఉపాధ్యక్షులు..

# 69 మంది ప్రధాన కార్యదర్శులు

### పీసీసీ కార్యవర్గంలో కీలక పదవుల ప్రకటన

- ఒక ఎంపీ, ఐదుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలకు చోటు
- విధేయత, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం
- బడుగువర్గాల నేతలకు 68% పదవులు
- వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులపై కొనసాగుతున్న ఉత్కంఠ

ప్రజాతీర్పు ప్రతినిధి, ఢిల్లీ

రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) కార్యవర్గంలో కీలక పదవులను ప్రకటించారు. మొత్తం 27 మంది రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులను, 69 మంది ప్రధాన కార్యదర్శులను పార్టీ అధిష్ఠానం వెల్లడించింది. పీసీసీలో అత్యంత కీలకమైన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను ఇంకా ప్రకటించలేదు. పదవుల భర్తీలో విధేయత, సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యం దక్కింది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్నవారి వివరాలను జిల్లాలవారీగా సేకరించి ఈ పదవులకు ఎంపికచేశారు. మంత్రివర్గ విస్తరణలో మాదిరి పీసీసీలోనూ బడుగువర్గాల వారికి ప్రాధాన్యమిచ్చారు. మొత్తం 27 మంది ఉపాధ్యక్షుల్లో బీసీలకు 8, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ముస్లిం మైనార్టీలకు 3 కలిపి 67% పదవులు దక్కాయి. ఇక ప్రధాన కార్యదర్శులు

- మిగతా 2వ పేజీలో

## శాఖల కేటాయింపుపై కసరత్తు

### కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ

మల్లికార్జున ఖర్గేతో నేడు..






# ప్రజలే కేంద్రంగా పాలన

### 11 ఏళ్ల ప్రస్థానంలో సమ్మిళిత, సర్వతోముఖాభివృద్ధి

- ప్రపంచంపైనా బలమైన ముద్ర వేశాం: మోదీ
- జవాబుల్ని దాటవేస్తున్నారని కాంగ్రెస్ ఎద్దేవా

ప్రజాతీర్పు ప్రతినిధి, ఢిల్లీ

తన నేతృత్వంలోని 11 ఏళ్ల పాలనలో దేశం అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించడంతోపాటు వాతావరణ మార్పులు, డిజిటల్ నవకల్పనలు వంటి అంశాల్లో ప్రపంచ వేదికపైనా బలమైన ముద్ర వేసిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్' (అందరితో కలిసి.. అందరి అభివృద్ధికి.. అందరి విశ్వాసంతో.. అందరి కృషితో) అనేదే తమ పాలనను నిర్దేశించే మూలసూత్రమని చెప్పారు. తన నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం

- మిగతా 2వ పేజీలో



# భార్య పేరు వెల్లడించనంత మాత్రాన ఎన్నిక చెల్లకుండాపోదు!

### కూనంనేనిపై ఎన్నికల పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుపై దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను సోమవారం హైకోర్టు కొట్టివేసింది. ప్రతి దశలోనూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలనే విషయంలో ఎలాంటి సందేహం లేదని, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ అన్నది ప్రజాస్వామ్యంలో కీలకమని, ఎన్నికల పిటిషన్‌లో కీలకమైన ఆధారాలుంటే తప్ప ప్రజలిచ్చిన తీర్పు చెల్లదంటూ కొట్టివేయలేమని స్పష్టంచేసింది. నామినేషన్ దాఖలు సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో భార్య పేరు ప్రస్తావించనంత మాత్రాన కూనంనేని ఎన్నిక చెల్లకుండా పోదని తేల్చిచెప్పింది. భార్యకు చెందిన ఐదేళ్ల ఆదాయపు పన్ను రిటర్నులు, ఆస్తులు, అప్పుల వివరాలను వెల్లడించారని గుర్తుచేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో

- మిగతా 2వ పేజీలో



# సామాజిక న్యాయ సిద్ధాంతానికి సానుకూల స్పందన

### ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో మంత్రి వివేక్

ప్రజాతీర్పు ప్రతినిధి, ఢిల్లీ

మంత్రివర్గ విస్తరణలో బడుగు, బలహీనవర్గాలకు ప్రాధాన్యం కల్పించడంపట్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నట్లు మంత్రి జి.వివేక్ పేర్కొన్నారు. ఇదే విషయాన్ని తాను పార్టీ అధ్యక్షుడికి చెప్పినట్లు వెల్లడించారు. ఆదివారం నాడు మంత్రిగా ప్రమాణం చేసిన ఆయన సతీమణి సరోజ, కుమారుడు, పెద్దపల్లి ఎంపీ వంశీతో సోమవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ "రాహుల్ గాంధీ వినిపిస్తున్న సామాజిక న్యాయ సిద్ధాంతానికి సానుకూల స్పందన లభిస్తోందని చెప్పా. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మూడు పోస్టుల భర్తీ సమయంలో ఓసీలకు

- మిగతా 2వ పేజీలో



# తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లు లేకనే మేడిగడ్డకు..

### మంత్రివర్గ ఆమోదంతోనే కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని నిర్మాణాలు

- కమిషన్ బహిరంగ విచారణలో హరీశ్‌రావు
- బ్యారేజీల్లో పూర్తిస్థాయిలో నీరు నింపాలని ఎవరు ఆదేశించారని ప్రశ్నించిన జస్టిస్ ఘోష్
- ప్రభుత్వం నుంచి ఎవరూ ఆదేశించలేదని, అది ఇంజినీర్ల నిర్ణయమేనని పేర్కొన్న మాజీ మంత్రి

ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

"తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లు లేకనే మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చాం. ప్రాజెక్టుల పునరాకృతికి అప్పటి సీఎం కేసీఆర్ మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. పలు ప్రాజెక్టులపై ఉప సంఘం అధ్యయనం చేసి.. నివేదిక ఇచ్చిన తర్వాతే కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీల నిర్మాణాలు జరిగాయి. ఈ ప్రాజెక్టులో అన్ని పనులకూ మంత్రివర్గ ఆమోదం ఉంది" అని నీటిపారుదల శాఖ మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు కాళేశ్వరం న్యాయవిచారణ కమిషన్ ఎదుట పేర్కొన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు సోమవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అంతా నిజమే చెబుతానంటూ ప్రమాణం చేసిన హరీశ్‌రావు.. పలు జీవోలు, సీడబ్ల్యూసీ, మహారాష్ట్ర ప్రభుత్వం, ఈఎన్సీ, కమిటీలకు సంబంధించిన లేఖలను కమిషన్‌కు ఆధారాలుగా అందజేశారు. హైదరాబాద్‌లో బీఆర్కే భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో జరిగిన బహిరంగ విచారణలో 42 నిమిషాలపాటు హరీశ్‌రావును జస్టిస్ ఘోష్ విచారించారు. జీవో 655 ద్వారా

- మిగతా 2వ పేజీలో




# సామాజిక రుగ్మతలను రూపుమాపితేనే నవ సమాజ నిర్మాణం

### మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాతీర్పు ప్రతినిధి, సోమాజిగూడ

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వ, సంక్షేమ పథకాలు మాత్రమే సరిపోవని, సామాజిక రుగ్మతలను రూపుమాపినప్పుడే నవ సమాజం నిర్మితమవుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ప్రభుత్వ

# ఎస్‌వోటీ లక్ష్యం ఏమిటి?

### ట్యాపింగ్ పేర్ల ఎంపిక ఎలా జరిగింది?

సిట్ ప్రశ్నలకు ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు మౌనం

అధికారులకు చెప్పే ఆధారాలు ధ్వంసం చేసినట్లు వెల్లడి!

8 గంటలపాటు విచారణ.. రేపు మళ్లీ రావాలని నోటీసులు



ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు సిట్ అధికారుల ప్రశ్నలకు మౌనం దాల్చారు. సుదీర్ఘ ఎదురుచూపుల తర్వాత సోమవారం ఎట్టకేలకు ఆయన సిట్ ముందుకు వచ్చారు. ఇప్పటి వరకూ దర్యాప్తులో వెల్లడైన ఆధారాలను ముందు పెట్టి మరీ అధికారులు అడిగిన ప్రశ్నలు ఆయనను కొంత కలవరపాటుకు గురిచేసినట్లు, దాంతో వాటికి ఎలాంటి సమాధానం చెప్పాలో తెలీక మౌనంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆధారాల ధ్వంసానికి సంబంధించి సూటిగా సమాధానం చెప్పిన ఆయన.. ప్రణీత్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటైన స్పెషల్ ఆపరేషన్స్ టార్గెట్(ఎస్‌వోటీ) గురించి మాత్రం

- మిగతా 2వ పేజీలో



# 'మహాలక్ష్మి'తో నిలదొక్కుకున్న ఆర్టీసీ

### 182 కోట్ల జీరో టికెట్లను వినియోగించుకున్న మహిళలు

రూ.6,088 కోట్లు జమచేసిన ప్రభుత్వం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాతీర్పు ప్రతినిధి, సూర్యాపేట

ప్రజాప్రభుత్వం వచ్చాక తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ ఆర్థికభారం నుంచి బయటపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతి, మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి సూర్యాపేట బస్ డిపోలో సోమవారం 45 ఎలక్ట్రిక్ బస్సులను భట్టి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో

- మిగతా 2వ పేజీలో

# 27 మంది ఉపాధ్యక్షులు.. 69 మంది ప్రధాన కార్యదర్శులు

(మొదటి పేజీ తరువాయి)

69 మందిలో 68% పదవులు బడుగులకే దక్కాయి. వీరిలో బీసీలకు 26, ఎస్సీలకు 9, ఎస్టీలకు 4, ముస్లింలకు 8 పదవులిచ్చారు. కాంగ్రెస్‌లో ఇరవై ఏళ్లుగా కొనసాగుతున్న సీనియర్ నేతలకే ఎక్కువ పదవులు ఇచ్చినట్లు పార్టీవర్గాలు తెలిపాయి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలసి గతంలో ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లలో పనిచేసిన వారికి చోటుదక్కడం గమనార్హం. ఉపాధ్యక్ష పదవుల్లో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బస్వరాజ్ సారయ్యలతోపాటు సీనియర్ నేతలైన కుమార్‌రావు, కొండ్రు పుష్పలీలతోపాటు పార్టీలోకి కొత్తగా వచ్చిన బొంతు రాంమోహన్ వంటి వారికి చోటుదక్కింది. ప్రధాన కార్యదర్శులుగా ముగ్గురు ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పర్నికారెడ్డి, మట్టా రాగమయితోపాటు సీనియర్ నేత షబ్బీర్‌అలీ, కత్తి వెంకటస్వామి, శశికళా యాదవరెడ్డి తదితరులున్నారు. మొత్తమ్మీద ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్సీలకు ఈ పదవులు కట్టబెట్టారు. మిగిలిన వారిలో ఎక్కువ మంది ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న వారేనని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ 'ఈనాడు'కు తెలిపారు. సీనియర్లు, జూనియర్ల కలయికతో కొత్త తరానికి కూడా తగిన ప్రాధాన్యమిచ్చినట్లు ఆయన వివరించారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసేవారికే రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడానికి కృషిచేశామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల భర్తీలోనూ సామాజిక న్యాయానికే పెద్దపీట వేస్తామని ఆయన స్పష్టంచేశారు.



### ప్రధాన కార్యదర్శులు...

ఎమ్మెల్యేలు... వెడ్మ బొజ్జు, సీహెచ్ పర్నికారెడ్డి, మట్టా రాగమయి, నేతలు... షబ్బీర్‌అలీ, సీహెచ్ రాంభూపాల్, ఎ.సంజీవ్ ముదిరాజ్, బొజ్జా సంధ్యారెడ్డి, మల్లాడి రామిరెడ్డి, అబ్దేషి సదాలక్ష్మి, ఎం.బేబీ స్వర్ణకుమారి, ధారాసింగ్ తాండూరు, జి.శశికళా యాదవరెడ్డి, కత్తి వెంకటస్వామి, మహమ్మద్ అబ్దుల్ ఫహీం, సంతోష్‌కుమార్ రుద్ర, దుర్గం భాస్కర్, మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్, వి.జగదీశ్వర్‌గౌడ్, నరేష్‌జాదవ్, అల్లంభాస్కర్, గిరిజా శెట్కార్, కొప్పుల ప్రవీణ్‌కుమార్, ఎ.జంగారెడ్డి, కస్బా శ్రీనివాస్‌రావు, దుద్దిళ్ల శ్రీనివాస్, బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, చరగని దయాకర్, పీసరి మహిపాల్‌రెడ్డి, గజ్జెలకాంతం, ఈడ్పుగంటి సుబ్బారావు, చకిలం రాజేశ్వరరావు, ఈర్ల కొమరయ్య, ఎ.రవిబాబు, నాగ సీతారాములు, శానెం శ్రీనివాస్‌గౌడ్, పృథ్వీచౌదరి వేముల, అంబడి రాజేశ్వర్, డీడీ వెంకట్‌రాజ్, బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్‌గౌడ్, కాట్ల రంగారావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, మాడు సత్యనారాయణగౌడ్, తోపాజీ అనంతకిషన్, వి.రామారావుగౌడ్, అచ్యుత్ రమేష్‌బాబు, పెద్దనోళ్ల బాల మురళీకృష్ణ(చిన్న), ఎం.రాజీవ్‌రెడ్డి, షమీమ్ ఆఘా, ఈవీ శ్రీనివాస్‌రావు, మిథున్‌రెడ్డి, అమొగోత్ వెంకటేష్‌పవార్, రాయగిరి కల్పనాయాదవ్, రాజేష్ కషిపాక, రహమత్ హుస్సేన్, పి.ప్రసన్నకుమార్ శర్మ, మహమ్మద్ అసదుద్దీన్, నందిమళ్ల యాదయ్య ముదిరాజ్, దైదా రవీందర్, ఉప్పల శ్రీనివాస్‌గుప్త, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, జి.నాగభూషణం, ఉపేందర్‌రెడ్డి, ధర్మారావు, నూతి సత్యనారాయణగౌడ్, దుర్గాప్రసాద్, సి.వెంకట గోవింద్‌రావు, పెండ్లి శ్రీనివాసులురెడ్డిలు ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు.

### వీరే కొత్త ఉపాధ్యక్షులు

ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బస్వరాజ్ సారయ్య, నేతలు... కుమార్‌రావు, ఝాన్సీరెడ్డి, బండి రమేశ్, కొండ్రు పుష్పలీల, కోట నీలిమ, కైలాశ్‌కుమార్, నమిండ్ల శ్రీనివాస్, ఆత్రం సుగుణ, గాలి అనిల్‌కుమార్, చిట్ల సత్యనారాయణ, లకావత్ ధనవంతి, ఎం.వేణుగౌడ్, కొమిరెడ్డి వినయ్‌రెడ్డి, కొండేటి మల్లయ్య, ఎం.ఎ.ఫహీం, సురేష్‌కుమార్, బొంతు రాంమోహన్, ఆఫ్సర్ యూసుఫ్‌జాహీ, ఎస్.జగదీశ్వర్‌రావు, ముజాహిద్ ఆలంఖాన్, గుమ్ముల మోహన్‌రెడ్డి, చిన్నపటల సంగమేశ్వర్‌లు ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.

# ఎస్‌వోటీ లక్ష్యం ఏమిటి?

(మొదటి పేజీ తరువాయి)

ఎంత ప్రశ్నించినా జవాబివ్వలేదు. సుదీర్ఘ ప్రయాణం చేసి ఉండటంతో దర్యాప్తు అధికారులు కూడా ఆయనను ఎక్కువ ప్రశ్నలు అడగలేదు. విమానాశ్రయంలో కూడా బాగా ఆలస్యమైందని, సరైన విశ్రాంతి లేదని ప్రభాకర్‌రావు చెప్పడంతో మధ్యమధ్యలో విరామమిస్తూ నిర్దిష్టమైన ప్రశ్నలు మాత్రమే సంధించారు. 11న మరోమారు విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు ఇచ్చారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోని సిట్ కార్యాలయానికి ఉదయం 11 గంటల సమయంలో కుమారుడితో కలిసి వచ్చిన ప్రభాకర్‌రావును అధికారులు 8 గంటలు విచారించారు. రాజకీయ లబ్ధి కోసం అప్పటి భారాస ప్రభుత్వం అడ్డగోలుగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం దీనిలో నిజాలు నిగ్గు తేల్చాలని పట్టుదలతో ఉంది. ఎస్ఐబీ అధిపతి హోదాలో ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, అప్పటి ప్రభుత్వ సూచన మేరకు ఆయన నడుచుకున్నారన్నది అభియోగం. దాంతో ఈ కేసు దర్యాప్తులో ప్రభాకర్‌రావు వాంగ్మూలం కీలకంగా మారింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు, భుజంగరావు, తిరుపతన్నలు వాంగ్మూలం ఇచ్చారు. 2023 శాసనసభ ఎన్నికలతోపాటు అంతకు ముందు జరిగిన మునుగోడు ఉపఎన్నికలో ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేయాలన్న వివరాలతో ప్రణీత్‌రావు ఆధ్వర్యంలో ఎస్‌వోటీ ఏర్పాటు చేసినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైన సంగతి తెలిసిందే. ఇందులో అనేక మంది రాజకీయ నాయకుల పేర్లు ఉన్నాయి. దాంతో అసలు ఎస్‌వోటీ లక్ష్యం ఏమిటి, దీన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది, ట్యాప్ చేయాల్సిన వారి పేర్లు ఎవరు చెప్పేవారు? అని సిట్ అధికారులు ప్రభాకర్‌రావును సూటిగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కాని ఆయన దీనికి సమాధానం ఇవ్వలేదు. అయితే ఎస్‌వోటీ ఏర్పాటు చేయలేదని కూడా చెప్పకపోవడం గమనార్హం. ప్రణీత్‌రావు విచ్చలవిడిగా ట్యాపింగ్‌కు పాల్పడుతున్న సంగతి తెలుసా, తెలిస్తే ఎందుకు నివారించలేదు, అసలు ఆయన ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేస్తున్నాడో మీకు తెలుసా? అని అడిగిన ప్రశ్నలకు కూడా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదని తెలుస్తోంది.

'2023 ఎన్నికల్లో భారాస ఓడిపోగానే ఎస్ఐబీలో ఫోన్ ట్యాపింగ్‌కు వాడిన ఉపకరణాలన్నీ ప్రణీత్‌రావు ధ్వంసం చేశారు. ఇంత జరుగుతున్నా ఎందుకు స్పందించలేదు, అసలు ఆధారాలు ధ్వంసం చేయమని ఎందుకు ఆదేశాలు ఇచ్చారు' అని అధికారులు ప్రశ్నించారు. ఆయన సమాధానమిస్తూ ఇదంతా తమ విధి నిర్వహణలో భాగమేనని, ఎస్ఐబీలో ఇది క్రమం తప్పకుండా జరుగుతుందని, అప్పుడు కూడా పైఅధికారులతో చెప్పిన తర్వాతే ఆధారాలు ధ్వంసం చేశామని స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. దీనివల్ల ఎన్నో ఏళ్ల నుంచి సేకరించి పెట్టుకున్న విలువైన సమాచారం కూడా ధ్వంసమైంది కదా అని అడిగినప్పుడు మాత్రం మళ్లీ మౌనం పాటించారని తెలుస్తోంది. తొలిరోజు విచారణలో వెల్లడించిన అంశాలను నమోదు చేశారు. వాటిని ఆయన చదివి సంతకం చేసిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు అంగీకరించారు. డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ వెంకటగిరి కలిసి ప్రభాకర్‌రావును విచారించారు.

# శాఖల కేటాయింపుపై కసరత్తు

ప్రజాతీర్పు ప్రతినిధి, దిల్లీ

తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన ముగ్గురు మంత్రులకు శాఖల కేటాయింపులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కసరత్తు ప్రారంభించారు. ఇదే అంశంపై సోమవారం మధ్యాహ్నం దిల్లీకొచ్చిన ఆయన సాయంత్రం ఇక్కడి ఇందిరాభవన్‌లో పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జి కేసీ వేణుగోపాల్‌తో సుమారు గంటపాటు చర్చించారు. ఈ సందర్భంగా పాత మంత్రులు చూస్తున్న బాధ్యతలు, ప్రస్తుతం ఖాళీగా ఉన్న శాఖల జాబితాను ఆయనకు అందించినట్లు తెలిసింది. కొత్తవారికి పూర్తిగా కొత్త శాఖలు కేటాయించాలా... పాత మంత్రులు చూస్తున్న అదనపు శాఖలను వారి నుంచి తొలగించి వీరికివ్వాలా... అన్న విషయమై సమాలోచనలు చేశారు. ప్రస్తుతం సీఎంతోపాటు 11 మంది మంత్రుల చేతుల్లో దాదాపు 29 శాఖలున్నాయి. కీలకమైన మున్సిపల్, హోం, విద్యా శాఖలను సీఎం తనవద్దే ఉంచుకున్నారు. శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కల వద్ద మూడేసి శాఖలున్నాయి. తాజా విస్తరణతో క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కి చేరింది. మంత్రివర్గ విస్తరణలో ఎస్సీ, బీసీ సామాజికవర్గాలకు ప్రాధాన్యం కల్పించి, సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లామని, మంత్రులకు శాఖల కేటాయింపులోనూ అదే ప్రాధాన్యం కొనసాగించాలనే విషయంపైనా వారు మాట్లాడుకున్నట్లు సమాచారం. మిగిలిన ఖాళీల భర్తీ అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డితోపాటు మరో ఇద్దర్ని క్యాబినెట్‌లోకి తీసుకోవాలని భావించినప్పటికీ సాధ్యంకాకపోవడానికి దారితీసిన అంశాలపై ఇద్దరు నేతలు మాట్లాడుకున్నట్లు తెలిసింది. అసంతృప్త నాయకులతో పార్టీ రాష్ట్ర నాయకత్వం మాట్లాడిన విషయంపైనా రేవంత్‌రెడ్డి... వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

ఇప్పటివరకున్న సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి, పాత మంత్రుల శాఖల్లో మార్పులు చేయబోరని, కొత్తవారికి కొత్త శాఖలు కేటాయిస్తారని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. హోం, ప్రాథమిక, ఉన్నత, వైద్య విద్య శాఖలు, పశు సంవర్ధకం, పాడి పరిశ్రమాభివృద్ధి, గనులు, మైనార్టీ సంక్షేమం, వాణిజ్య పన్నులు, కార్మిక, ఎంఎస్‌ఎంఈ, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖలు ఖాళీగా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖను ఎవరికీ కేటాయించలేదు. మున్సిపల్ శాఖను కోర్, రూరల్ విభాగాలుగా విభజించారు. ఇందులో కొన్ని కొత్త మంత్రులకు అప్పగించవచ్చని చెబుతున్నారు. అయితే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో చర్చించిన అనంతరం దీనిపై ఒక నిర్ణయానికి రావాలని వారిద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి మంగళవారం మల్లికార్జునఖర్గేతో సమావేశమయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఆ తర్వాతే శాఖల కేటాయింపుపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

# తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లు లేకనే మేడిగడ్డకు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం పాత్ర గురించి కమిషన్ ప్రశ్నించగా.. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణం చేపట్టిన ప్రాజెక్టులకు నీటి కేటాయింపులకు సంబంధించి సీడబ్ల్యూసీ నుంచి అనుమతులు, అంతర్రాష్ట్ర సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలన్నింటిపైనా అధ్యయనానికి, ప్రాజెక్టుల పునరాకృతికి నన్ను ఛైర్మన్‌గా, అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావులు సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారు. ప్రాణహిత-చేవెళ్లను రెండు భాగాలుగా నిర్మించాలని కమిటీ నివేదిక ఇచ్చింది" అని హరీశ్‌రావు పేర్కొన్నారు. 148 మీటర్ల స్థాయిలోనే నిర్మించుకోవాలన్న మహారాష్ట్ర మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించడానికి కారణాలేంటన్న ప్రశ్నకు హరీశ్‌రావు సమాధానం ఇస్తూ.. "ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు మహారాష్ట్ర అంగీకరించడం లేదని గుర్తించి 2014 జులై 23న ఆ రాష్ట్రంతో సంప్రదిం పులు జరిపాం. ఆ రాష్ట్ర మంత్రి హసన్ ముష్రిఫ్‌తో సమావేశమయ్యాం. ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డికి గతంలో తమ సీఎం పృథ్వీరాజ్ చవాన్ లేఖ రాశారని, తుమ్మిడిహెట్టి సమీపంలో 152 మీటర్ల వద్ద నుంచి నీటిని తీసుకెళ్లేలా ప్రాజెక్టు నిర్మాణానికి తాము అంగీకరించబోమని అందులో పేర్కొన్నారని ఆయన చెప్పారు. ఇప్పటికే ప్రాజెక్టుపై తమ రాష్ట్రంలో ఆందోళనలు ఉన్నాయని, మరో ఐదు నెలల్లో మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు ఉన్నాయని.. ఆ తర్వాత చర్చిద్దామని అన్నారు. అనంతరం ఆ రాష్ట్రంలో భాజపా ప్రభుత్వం ఏర్పాటైంది. 2015 ఫిబ్రవరి 17న ఆ రాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్‌రావు నేతృత్వంలో అక్కడి రాజ్‌భవన్‌లో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో తెలంగాణ సీఎం కేసీఆర్ భేటీ అయ్యారు. ముంపు పరిహారం ఎంత అడిగితే అంత ఇస్తామని చెప్పారు. గతంలో ఆందోళన చేసిన తామే ఎలా అనుమతులు ఇచ్చేదంటూ ఫడణవీస్ తిరస్కరించారు. 148 మీటర్ల స్థాయిలో నిర్మించుకోవాలని సూచించారు.

2007లో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనులు ప్రారంభమైనా.. ఏడేళ్లపాటు మహారాష్ట్రను ఉమ్మడి ఏపీలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పించలేదు. కేంద్రంలో యూపీఏ, మహారాష్ట్ర, ఏపీలలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నా.. హెడ్ వర్క్సుకు అనుమతులు తేలేదు. ఈ క్రమంలో నీటి లభ్యతపై సీడబ్ల్యూసీకి రాష్ట్రం లేఖ రాసింది. తుమ్మిడిహెట్టి వద్ద 75 శాతం నీటి లభ్యత ఆధారంగా 165 టీఎంసీలు అందుబాటులో ఉండగా... భవిష్యత్తులో ఎగువ రాష్ట్రాలు వినియోగించే వాటా తీసివేస్తే 63 టీఎంసీలే అందుబాటులో ఉంటాయని 2015 ఏప్రిల్ 1న రాష్ట్రానికి సీడబ్ల్యూసీ లేఖ రాసింది. ఎగువన వినియోగించుకుంటే భవిష్యత్తులో తెలంగాణ అవసరాలకు నీళ్లు ఉండవని పేర్కొంది. ప్రాణహిత-చేవెళ్ల ద్వారా 16 లక్షల ఎకరాలకు నీరందించేందుకు వీలుగా అక్కడ నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ 2008 జులై 12నే లేఖ ద్వారా స్పష్టం చేసింది. రాష్ట్ర అవసరాల దృష్ట్యా నీటి లభ్యత, ఎత్తిపోతలపై మరోమారు సమీక్షించాలని 2015లో ప్రాజెక్టు అథారిటీకి రెండు లేఖలు రాసింది. ఈ ప్రాజెక్టులో ప్రతిపాదించిన రిజర్వాయర్లు రాష్ట్ర అవసరాలకు తగినట్లు లేవని, కృత్రిమ రిజర్వాయర్లు అవసరమని సీడబ్ల్యూసీ పేర్కొంది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ ఎత్తును 148 మీటర్లకు కుదిస్తే... 48 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంటాయని 2016 ఫిబ్రవరి 18న సీడబ్ల్యూసీ మరో లేఖలో పేర్కొంది. మహారాష్ట్ర అభ్యంతరాలు, సీడబ్ల్యూసీ సిఫార్సుల మేరకు నీటిని తీసుకునే ప్రాంతాన్ని మేడిగడ్డకు మార్చాల్సి వచ్చింది. దీనిలో భాగంగానే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించాలనే ప్రతిపాదన వచ్చింది. దీనిపై అధ్యయనానికి విశ్రాంత ఇంజినీర్లతో నిపుణుల కమిటీని నాడు కేసీఆర్ ఏర్పాటు చేశారు. ప్రాణహిత, గోదావరి కలిసేచోట మేడిగడ్డ వద్ద 283 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చింది. 2016 జులై 17న వ్యాప్కోస్ లైడార్ సర్వే చేసి.. మూడు బ్యారేజీలు నిర్మించి 160 టీఎంసీలను ఎత్తిపోయవచ్చని పేర్కొంది. మూడు బ్యారేజీల నిర్మాణానికి ప్రాంతాలను సూచిస్తూ రూ.13,593 కోట్లతో నిర్మించవచ్చని సూచించింది. ఈ క్రమంలో పాత ప్రాణహిత-చేవెళ్లలోని ఆరు లింక్‌లను కాళేశ్వరంలోకి ప్రభుత్వం మార్చింది" అని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎప్పుడు నిర్ణయం తీసుకున్నారని, బ్యారేజీల నిర్మాణాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందా అని కమిషన్ ప్రశ్నించగా 2015 ఏప్రిల్ 13న వ్యాప్కోస్‌ను సర్వే చేయాలని ప్రభుత్వం కోరగా... 2016 జులై 17న నివేదిక ఇచ్చిందని, ఆ నివేదికకు పరిపాలనపరమైన అనుమతులతోపాటు అన్ని రకాల అనుమతులను మంత్రివర్గం ఇచ్చిందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

బ్యారేజీల టెండర్లు కుదిరాక కాంట్రాక్ట్ నిబంధనలు మార్చారా అని కమిషన్ ప్రశ్నించగా.. నిర్మాణ ప్రాంతం, పనులకు అనుగుణంగా నిబంధనలను మార్చేందుకు నీటిపారుదలశాఖకు అవకాశం ఉంటుందని, అనివార్య పరిస్థితుల్లో ఈ అంశాలపై సిఫార్సు చేసేందుకు వీలు లేకపోలేదని హరీశ్‌రావు తెలిపారు. బ్యారేజీల స్థలాల మార్పునకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవో 28 గురించి ప్రశ్నించగా.. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించే బాధ్యతను నిపుణుల కమిటీకి ప్రభుత్వం అప్పగించిందని ఆయన తెలిపారు. మేడిగడ్డ నుంచి మధ్య మానేరుకు నేరుగా నీటిని ఎత్తిపోయడానికి వీలులేదని కమిటీ చెప్పిందని, ఈ మార్గంలో ఎన్టీపీసీ, బొగ్గు గనులు ఉన్నట్లు తెలిపిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎన్ని నీళ్లను నిల్వ చేసుకోవచ్చని కమిషన్ ప్రశ్నించగా.. 141 టీఎంసీలని హరీశ్‌రావు సమాధానమిచ్చారు. బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయొద్దన్నది తప్పుడు ప్రచారమేనని పేర్కొన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ పాత్ర, అధికారాలు ఏమిటని కమిషన్ ప్రశ్నించింది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ ఉద్యమం సాగిందని, కేసీఆర్ ముందుండి నడిపించారని, రాష్ట్రం ఏర్పాటయ్యాక శరవేగంగా ప్రాజెక్టులు నిర్మించి నీటిని ఇవ్వాలనేది ప్రధానోద్దేశమని హరీశ్‌రావు తెలిపారు. ప్రాజెక్టులకు భారీగా నిధులు అవసరమని గుర్తించి.. రుణాల కోసం కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశామన్నారు.



# భార్య పేరు వెల్లడించనంత మాత్రాన ఎన్నిక చెల్లకుండాపోదు!

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగూడెం నియోజకవర్గం నుంచి కూనంనేని సాంబశివరావు(సీపీఐ)... ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకట్రావుపై గెలుపొందారు. నామినేషన్ సందర్భంగా కూనంనేని దాఖలు చేసిన అఫిడవిట్‌లో భార్య పేరు వెల్లడించలేదని, వాస్తవాలను తొక్కిపెట్టిన కారణంగా ఎన్నిక చెల్లదని ప్రకటించడంతోపాటు శిక్ష, జరిమానా విధించాలంటూ ఓటరు నందూలాల్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి సోమవారం తీర్పు వెలువరించారు. నామినేషన్ సందర్భంగా భార్య పేరు వెల్లడించకపోవడంపై పిటిషనర్ ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని, అయినా మరో అభ్యర్థి జలగం వెంకట్రావు ఇదే విషయంపై అభ్యంతరం లేవనెత్తినా ఎన్నికల రిటర్నింగ్ అధికారి తోసిపుచ్చారన్నారు. కూనంనేని సమర్పించిన అఫిడవిట్‌లో భార్య పేరు మినహా ఆమె పేరుతో ఉన్న పాన్ నంబరు, ఐదేళ్ల ఆదాయపు పన్ను రిటర్నులు, ఆస్తులు, అప్పుల వివరాలను వెల్లడించారన్నారు. అందులో భార్య పేరు ఉంటుందని, అయితే అఫిడవిట్‌లో భాగస్వామి కాలమ్‌లో భార్య పేరును పేర్కొనకపోయినా మిగిలిన వివరాలన్నీ వెల్లడించారన్నారు. నిబంధనల ప్రకారమే నామినేషన్ ఉండటంతో రిటర్నింగ్ అధికారి దాన్ని ఆమోదించడంలో ఎలాంటి పొరపాటు చేయలేదన్నారు. ఎన్నికల పిటిషన్ విచారణార్హం కాదన్న కూనంనేని పిటిషన్‌ను ఈ కోర్టుతోపాటు సుప్రీంకోర్టు కొట్టివేసినంత మాత్రాన... దాన్ని ఒక కారణంగా ఇక్కడ పరిగణించలేమన్నారు. పిటిషన్ విచారణార్హమే అయినప్పటికీ ఎన్నిక చెల్లదంటూ సరైన ఆధారాలను చూపడంలో పిటిషనర్ విఫలమయ్యారన్నారు.

# సామాజిక రుగ్మతలను రూపుమాపితేనే నవ సమాజ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

పథకాలు- సమాజాభివృద్ధి, సాంస్కృతిక అంశాలపై జరిగిన సదస్సులో మంత్రి మాట్లాడారు. అర్హులైన కళాకారులకు సాంస్కృతిక కళా సారథిలో ఉద్యోగావకాశాలు, ప్రస్తుతం పనిచేస్తున్న వారికి పారితోషికం పెంపు అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సమాజ చైతన్య కార్యక్రమాలకు అవసరమైతే రూ.10 కోట్లు కేటాయిస్తామన్నారు. సదస్సులో చర్చించిన అంశాలపై కమిటీ వేసి కార్యాచరణ రూపొందించాలని, దీనికి ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం సమన్వయకర్తగా వ్యవహరించాలని కోరారు. ప్రొ.కోదండరాం మాట్లాడుతూ విద్యా ప్రణాళికలో నాటకం, సంగీతం, నృత్యం వంటివి చేర్చాలని, జానపద, గిరిజన కళారూపాలను భవిష్యత్తు తరాలకు అందించేందుకు శిక్షణ తరగతులు నిర్వహించాలని పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు కోరారు. అర్హులైన కళాకారులకు ఉద్యోగావకాశాలు, వృద్ధ కళాకారులకు పింఛన్ ఇవ్వాలన్నారు. జానపద కళాకారుల పారితోషికం పెంచాలని, ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని, హెల్త్ కార్డులు అందించాలని విన్నవించారు. తెలంగాణ సాంస్కృతిక కళా సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, పర్యాటక, సాంస్కృతిక విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కవులు, రచయితలు అందెశ్రీ, సుద్దాల అశోక్‌తేజ, పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ సిద్ధాంతానికి సానుకూల స్పందన

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన హామీని అమలు చేస్తామని వారు పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలు సాధించేందుకు కలిసి పనిచే యాలని ఖర్గే, కేసీ వేణుగోపాల్ సూచించారు" అని పేర్కొన్నారు. శాఖల కేటా యింపు అన్నది ముఖ్యమంత్రి ప్రత్యేకాధికారాల పరిధిలోకి వస్తుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'ఏ శాఖ అప్పగించినా నాన్న వెంకటస్వామి నేర్పిన విలువలు పాటిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేస్తా'అని వివేక్ పేర్కొన్నారు.

# 'మహాలక్ష్మి'తో నిలదొక్కుకున్న ఆర్టీసీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగిం చారు. "రాష్ట్రంలో మహిళలందరూ ఉచిత ప్రయాణం చేసేలా మహాలక్ష్మి పథకం తీసుకొచ్చాం. దీనిద్వారా ఆర్టీసీ ఏమవుతుందోనని చాలామంది ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకం ప్రారంభం నుంచి ఇంతవరకు 182 కోట్ల జీరో టికెట్లను వినియోగించుకున్నారు. ఆ టికెట్లను వాడుకున్న మహిళల తరపున రాష్ట్ర ప్రభుత్వం రూ.6,088 కోట్లు ఆర్టీసీకి జమచేసింది. దీంతో ఈరోజు ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకుంది. రాష్ట్రవ్యాప్తంగా గడువుతీరిన డీజిల్ బస్సుల్ని పక్కనపెట్టి పెద్దఎత్తున ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ ముందుకు వెళుతున్నాం. హైదరాబాద్ నగరాన్ని ఆహ్లాదకర ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఓఆర్ఆర్ లోపల 2,800 ఎలక్ట్రిక్ బస్సుల్ని అందుబాటులోకి తీసుకొచ్చాం. 2027 నాటికి ఈ-బస్సుల సంఖ్య మరింత పెంచుతాం" అని భట్టి పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్థలను ముందుకు నడిపిస్తున్నామన్నారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. "గతంలో అసలు ఆర్టీసీ ఉంటుందా అనే సందేహం ఉండేది. నేడు చాలా అభివృద్ధి చెందింది" అని అన్నారు. అనంతరం మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు కొంతదూరం ఈ-బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, ఎస్పీ నరసింహ, పర్యాటక సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలే కేంద్రంగా పాలన

(మొదటి పేజీ తరువాయి)

మూడో విడత పాలనలో తొలి ఏడాది పూర్తిచేసుకోవడం, మొత్తంగా ప్రధానిగా పగ్గాలు చేపట్టి సోమవారానికి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయాలను '11 ఏళ్ల సేవ' పేరుతో 'ఎక్స్' ద్వారా ఆయన పంచుకున్నారు. సమూల మార్పుల్ని అత్యంత వేగంగా, భారీ పరిమాణంలో తమ సర్కారు చేసి చూపించిందని తెలిపారు. 81 కోట్ల మందికి ఉచిత ఆహారధాన్యాలు, 15 కోట్ల మందికి కొళాయి కనెక్షన్లు, పేదల కోసం నాలుగు కోట్ల ఇళ్లను నిర్మించడం, దేశవ్యాప్తంగా 12 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం వంటివి ఆయన ప్రస్తావించారు. మంత్రిమండలిలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలవారే ఉన్నట్లు తెలిపారు. వీరికి ఈ స్థాయిలో పదవులు కేటాయించడం ఇదే తొలిసారి అని చెప్పారు.

మోదీ 11 ఏళ్ల పాలన దేశ ప్రజాస్వామ్యానికి, ఆర్థిక రంగానికి, సామాజిక కూర్పునకు పెద్దదెబ్బ అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజ్యాంగంలోని ప్రతి పేజీకి ప్రభుత్వం నియంతృత్వాన్ని అద్దిందని తూర్పారబట్టారు. రాజ్యాంగ వ్యవస్థల్ని భాజపా-ఆరెస్సెస్ బలహీనపరిచాయని చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న పథకాలన్నీ విఫలమయ్యాయన్నారు. వర్తమానం గురించి ప్రభుత్వం మాట్లాడటం మానేసి 2047పై కలల్లో విహరిస్తోందని లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ ఎద్దేవాచేశారు.



## ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించండి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూన్09(ప్రజాతీర్పు)**

ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తులో పేర్కొన్న అంశాన్ని సమగ్రంగా పరిశీలించి, వాస్తవ స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శానిటేషన్ చర్యలు నిర్లక్ష్యం కాకుండా నిర్వహించాలని సూచించారు. స్కూల్లు, హాస్టళ్ళు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాలో ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష చేసి, పనుల్లో వేగం తీసుకురావాలని సూచించారు. ప్రజల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్క శాఖ సమన్వయంతో పనిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయాల్లో గడ్డం వెంకటస్వామి కాక ఫ్యామిలీ హవా

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 9**

మంచిర్యాల జిల్లా కేంద్ర రాష్ట్ర రాజకీయాల్లో అదృష్టం అంటే మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి (కాక) కుటుంబానిదె అని చెప్పవచ్చు కాంగ్రెస్ హయాంలో కేంద్రమంత్రిగా గడ్డం వెంకటస్వామి( కాక ) పనిచేయగా ఆయన కుమారుడు గడ్డం వివేక్ చెన్నూరు ఎమ్మెల్యే నేడు తొలిసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు గతంలో వినోద్ కార్మిక శాఖ మంత్రిగా పనిచేసినారు ప్రస్తుతం బెల్లంపల్లి ఎమ్మెల్యేగా ఉన్నారు వివేక్ తనయుడు పెద్దపల్లి ఎంపీగా కొనసాగుతున్నారు




## ముందు జాగ్రత్త చర్యగా పిల్లలకు వ్యాక్సిన్

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 9)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తన కార్యాలయం మీటింగ్ హాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రము మరియు పట్టణ ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ల అందరితో రోటసిల్ వ్యాక్సిన్ ఒక డోసు కలిగిన వ్యాక్సిన్ నుండి రెండు డోసులు కలిగిన వ్యాక్సిన్ ప్రారంభానికి సంబంధించి శిక్షణ కార్యక్రమం ఇచ్చారు. ఇంతకు ముందు రోటా వైరస్ సింగల్ డోస్ వయల్ని 6వారాలు 10 వారాలు 14 వారాల వ్యవధితో మూడు డోసులు ఇవ్వడం జరిగేదనీ ఇప్పుడు కూడా రెండు డోసులు కలిగిన వయల్ ను ఉపయోగించి కూడా ఇదే విధానంలో వ్యాక్సిన్ ఇవ్వవలసిందిగా, ఇది పిల్లల్లో తీవ్రమైన విరోచనాలు, వాంతులు కలగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పిల్లలకి వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాజిద, పట్టణ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్వైజర్లు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ను వరించని మంత్రి పదవి

**మంచిర్యాల జిల్లా ప్రజాతీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 9**



మంచిర్యాల: కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పల కాపాడుకుంటూ 2014 నుండి 2023 వరకు ఉనికి లేకుండా మనోధైర్యంతో ఇంద్రవెల్లి సభ నుంచి మంచిర్యాలలో సభల వరకు సభలు నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి ఎన్నో విశ్వ ప్రయత్నాలు చేసిన ప్రేమ్ సాగర్ రావు ఉమ్మడి ఆదిలాబాద్ గుండెచప్పుడు లాంటి గొప్ప మనిషి ప్రేమ్ సాగర్ రావు గారికి మంత్రి పదవి ఇవ్వకపోవడం చాలా అన్యాయం బాధాకరం ఆని కాంగ్రెస్ పార్టీ పట్టణ మైనార్టీ అధ్యక్షులు మమ్మద్ గౌస్ బాయ్ అన్నారు ఇప్పటికైనా అధిష్టానం పురాలోచన చేసి అటు కాంగ్రెస్ పార్టీకి ఇటు ఉమ్మడి ఆదిలాబాద్ లో ఉన్న ప్రజలకు కార్యకర్తలకు వెన్నంటూ ఉంటూ ఎప్పటికప్పుడు వారికి మనోధైర్యాన్ని కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని కార్యకర్తను కాపాడుకుంటూ వచ్చినటువంటి ప్రేమ్ సాగర్ రావు గారికి మంత్రి పదవి ఇవ్వాలని ఉమ్మడి ఆదిలాబాద్ ప్రజలు బెల్లంపల్లి కాంగ్రెస్ పట్టణ మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుంగల మల్లేష్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరుచున్నారు

# పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదు

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ జూన్ 9 )**




కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీడీవో వైఖరి పై జిల్లా స్థాయి అధికారులు సమగ్రమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ముట్టడికి యత్నించడంతో పోలీసులు అరెస్ట్ చేశారని సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పేదలకు అందించే క్రమంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో జిల్లా వ్యాప్తంగా అనేక అవతకవలు చోటు చేసుకున్నాయని శ్రీనివాస్ ఆరోపించారు. చిగురుమామిడి మండలంలో అధికార కాంగ్రెస్ కనుసన్నల్లోనే లబ్దిదారుల ఎంపిక జరగడంతో అర్హులైన వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. అర్హులైన వారిని ఎంపిక చేయాల్సిన చిగురుమామిడి ఎంపిడీవో తన చాంబర్ లో అర్ధరాత్రి వరకు కాంగ్రెస్ నాయకులను కూర్చోబెట్టుకుని లబ్దిదారులను ఎంపిక చేయడం వివాదాస్పదమైందని,ఎంపిడీవో స్థాయి అధికారి ఓ కాంగ్రెస్ కార్యకర్తలాగా వ్యవహరించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. లబ్దిదారుల ఎంపికలో గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసినా అధికారులు కూడా వారి విధులు సక్రమంగా నిర్వహించలేదని, ప్రత్యేక అధికారి ఉన్నప్పటికీ లబ్దిదారుల ఎంపిక విషయంలో కాంగ్రెస్ నాయకుల మితిమీరిన జోక్యంతో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు అంతటా నెలకొన్నాయని శ్రీనివాస్ ఆరోపించారు. లబ్ధిదారుల ఎంపికలో చిగురుమామిడి ఎంపిడివోపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకొని, అర్హులైన లబ్దిదారులను గుర్తించి న్యాయం చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో డబుల్ బెడ్ రూం పథకం పేరిట ఊరించినప్పటికీ ఒక్క ఇల్లు ఇవ్వలేదన్నారు. జిల్లాలో కొన్ని చోట్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించినా పేదలకు ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. పదేళ్ల పాటు పేదల సొంతింటి కల నెరవేలేక పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొంతింటి కళ నెరవేరుతుందనుకుంటే అర్హులకు అందకపోవడం బాధాకరమని , ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతో స్నేహపూర్వకంగా కొనసాగుతున్నప్పటికీ పేద ప్రజలకు అన్యాయం జరిగితే సిపిఐ చూస్తూ ఊరుకోదని,పేదల పక్షాన అండగా నిలిచి సర్కారు మెడలు వంచేలా మిలిటెంట్ పోరాటాలకు సీపీఐ సిద్ధమవుతుందని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, అందె చిన్న స్వామి, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, బామండ్ల పెల్లి యుగేందర్,సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ ,పైడిపల్లి వెంకటేష్, మాజీ సర్పంచులు గోలి బాపురెడ్డి కోమటిరెడ్డి జయపాల్ రెడ్డి, గ్రామ శాఖ కార్యదర్శిలు ఎలగందుల రాజు,కయ్యం తిరుపతి,మంద ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ నరమేధాన్ని ఆపాలి

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- కొండు బానేష్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు

**మంచిర్యాల జిల్లా ప్రజా తీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 9**




మంచిర్యాల జిల్లా తాండూరు మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపి వేయాలి 2026 మార్చి నాటికి మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఫాసిస్టు చర్యల్లో భాగమేనని ఆపరేషన్ కగా ర్ పేరుతో ఇప్పటివరకు 540 మందిని చట్ట విరుద్ధంగా హత్య చేశారని ఆపరేషన్ కగార్ మూలంగా మృతుల్లో ఆదివాసీ లు ఎక్కువగా ఉన్నారని అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అక్కడి ప్రజలు భయానక స్థితిలో జీవనం కొనసాగించాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడ్డాయని ప్రాథమిక హక్కులు కోల్పోతున్నారని తక్షణమే న్యాయ విచారణ చేపట్టాలని ఈ చట్ట విరుద్ధ హత్యలను భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని మావోయిస్టులు కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కొనసాగించడం దుర్మార్గమని రాజ్యాంగ బద్దంగా పరిపాలన చేయాలని ఆ ప్రజాస్వామిక పద్ధతుల్లో పాలన సాగుతుందని శత్రు దేశాలపై యుద్ధం చేసినట్లు మధ్య భారతంలో భారత పౌరులపై యుద్ధం చేయడం సరికాదని ఉగ్రవాద సంస్థలలో గత ప్రభుత్వాలు చర్చలు జరిపాయని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని వామపక్ష. లౌకిక. ప్రజాతంత్ర ప్రజాస్వామ్య శక్తులు. ప్రజా సంఘాలు ప్రజలు చర్చలు చేయాలని కోరుతున్నారూ ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయలేకపోవడం విచారకరమని శాంతి చర్చల కమిటీ 10 వామపక్ష పార్టీలు. లౌకిక శక్తుల ఆధ్వర్యంలో అన్ని జిల్లాలలో వివిధ రూపాలలో సభలు. సమావేశాలు జరపాలని. ఈనెల 14.న హైదరాబాదులో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని. వీటన్నింటిని జయప్రదం చేయాలని మేధావులు బుద్ధి జీవులు పాల్గొనాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో నరాల ప్రహ్లాద్ సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి. మలిశెట్టి సత్యనారాయణ సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి. ఇందారపు రాజేష్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి. కంబాల చందు. మీసాల సన్యాసి. గజ్జల వెంకన్న. చీకటి భీమేష్. శాలిగామ రాగులయ్య. కొండు సాయికుమార్. తదితరులు పాల్గొన్నారు.

## అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు మంత్రి పదవి ఇవ్వడం హర్షం

### కాంగ్రెస్ సీనియర్ నేత గంగారపు రాజయ్య

**భీమదేవరపల్లి, జూన్ 9 (ప్రజా తీర్పు విలేకరి )**



ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు మంత్రి పదవి ఇవ్వడం పట్ల భీమదేవరపల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గంగారపు రాజయ్య హర్షం వ్యక్తం చేశారు సోమవారం నాడు ఆయన భీమదేవరపల్లి మండలం కొత్త కొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి భీమదేవరపల్లి మండలంలోని కట్కూరు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు అమ్మగారిల్లని ఆయన ఈ ప్రాంతానికి సుపరిచితులని ఆయనకు ఈ ప్రాంతంలో భీమదేవరపల్లి మండలంలో అనేకమంది బంధువులు ఉన్నారని గంగారపు రాజయ్య తెలిపారు. అంచలంచలుగా ఎదిగిన లక్ష్మణ్ కుమార్ కు మంత్రి పదవి ఇవ్వడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అఖిల భారత కాంగ్రెస్ నాయకులకు గంగారపు రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పదవి పొందిన లక్ష్మణ్ కుమార్ గారు ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్ర స్వామి ఆశీస్సులు త్వరలో పొందుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ బడి ..అమ్మ వాడి లాంటిది

### ప్రధానోపాధ్యాయులు రవీందర్

**నర్సంపేట జూన్ 9 (ప్రజా తీర్పు**



చెన్నారావుపేట మండలం జూన్ 12 నుంచి నూతన విద్య సంవత్సరం ప్రారంభం కానుండగా. బోజేర్వు గ్రామంలో బడిబాట కార్యక్రమం గురించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక కొన్నత పాఠశాల (ఇంగ్లీష్ మీడియం) పాఠశాల ఆవశ్యకతను గ్రామంలోని పెద్దలు చర్చించడం జరిగింది. పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ఉన్న తేడాను వివరించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాల పై ఉన్న అపోహలు గురించి చర్చించుకోవడం జరిగింది. దానికి ఉపాధ్యాయులు మాపై పిల్లల తల్లిదండ్రులుగా మీరు నమ్మకం ఉంచండి ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులను మండలంలోని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతామని హామీ ఇవ్వడం జరిగింది. తల్లిదండ్రులు కూడా ఉత్సాహం కనబరిచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు అడ్మిషన్ చేపిస్తామని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్ ఉపాధ్యాయులు గ్రామ మాజీ ఉపసర్పంచ్ కుసుమ సతీష్,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు పెద్ద బోయిన ఎల్లయ్య, ఇట్టబోయిన రమేష్ రుద్రారాపు రమేష్, నూకల కృష్ణ యాదవ్, గ్రామంలోని యువకులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది. ప్రధానోపాధ్యయూలు , ఉపాధ్యయూలు పాఠశాల యాజమాన్య కమిట్,గ్రామం లోని ప్రతి ఇంటికి వెళ్లి పాఠశాలలో నూతనగా ఏర్పాటు చేసిన వసతులను వివరించి,ప్రైవేట్ బడికి ధీటుగా మన బడి కూడా ఉంది అని వివరించారు. గ్రామంలో తల్లితండ్రుల తమ పిల్లలను చేర్చేందుకు ఉత్సహం కనబరిచారు అని ప్రధానోపాధ్యయూలు తెలిప్యారు

## సిరిసిల్ల పట్టణంలో గుర్తుతెలియని మృతదేహం

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ జూన్ 9**



సిరిసిల్లని పాత బస్సు స్టాండు వద్ద నేలపై గుర్తు తెలియని మగ మనిషి లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతుని వయస్సు అందాదా 45-55 సంవసరాలు ఉంటుంది. మృతుడు ఎరుపు, మరియు నలుపు, రంగు గీతలు గల టీ - షర్ట్, నలుపు రంగు నైట్ ప్యాంట్ దరించి ఉన్నాడు. మృతుని ఎత్తు అందాదా 5.6 ఫీట్స్ కలడు. మృతుని శవము సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గది నందు కలదు. మృతున్ని ఎవరైనా గుర్తించిన అతడి వివరాలు తెలిసిన సిరిసిల్ల పోలీస్ స్టేషన్ ఈ క్రింది ఫోన్ నంబర్స్ కి 8712656366ఎ 8712656367 సమాచార ఇవ్వాల్సిందిగా పోలీసులు కోరారు.

## సుమలత హత్య కేసులో నిందితుడు గూళ్ల రాజు అరెస్టు

### సీఐ పులి రమేష్ బృందాన్ని అభినందించిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

**(ప్రజాతీర్పు విలేఖరి) భీమదేవరపల్లి జూన్ 9 :**



మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామంలో జూన్ 5న జరిగిన కోల సుమలత హత్య కేసులో గ్రామానికి చెందిన గుళ్ళ రాజును అరెస్టు చేసినట్లు విలేకరుల సమావేశంలో కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సందర్భంగా కేసు వివరాలను వెల్లడిస్తూ, మూడేళ్లుగా కుటుంబ వివాదాల నేపథ్యంలో కేసుల్లో ప్రధాన సాక్షిగా ఉన్న సుమలతను హత్య చేస్తే శిక్ష తప్పుతుందని భావించిన రాజు, గొడ్డలితో తలపై దాడి చేసి ఆమెను దారుణంగా హత్య చేశాడు. మృతురాలి ఫోన్ తీసుకొని పరారయ్యాడు. డీసీపీ సలీమా ఆదేశాల మేరకు ఏసీపీ నేతృత్వంలో ఏర్పాటైన మూడు ప్రత్యేక బృందాలు ముల్కనూర్ శివారులో నిందితుడిని పట్టుకున్నారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలి, సెల్‌ఫోన్, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్సై సాయిబాబు, వంగర ఎస్సై దివ్యలను ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ప్రశంసించారు.

# 2.99 లక్షల కోట్లతో అమృత్ 2 అమలు

- ప్రతి ఇంటికి నీళ్లు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించడమే లక్ష్యం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ జూన్ )




అమృత్ 2 పథకం కింద దేశవ్యాప్తంగా పట్టణాల్లో నివసించే వారికి నీళ్లను అందించేందుకు రూ.2 లక్షల 99 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. ఇందులో కేంద్ర వాటా కింద 76 వేల 760 కోట్ల రూపాయలను కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని ఆయా రాష్ట్రాలు, నగర పాలక సంస్థలు సమీకరించు కుంటున్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగా అమృత్ 1, అమృత్ 2.0 కింద తెలంగాణలో మొత్తం 6 వేల 876 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం చొప్పదండి పట్టణంలోని నల్లాలబావి వద్ద స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభతో కలిసి రూ.36.3 కోట్ల వ్యయంతో 'వాటర్ ఇంప్రూవ్ మెంట్' స్కీంకు కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చొప్పదండి మున్సిపాలిటీలో ప్రతి ఒక్కరికీ సరిపడ నీళ్లను అందించాలనే లక్ష్యంతో అమృత్ 2 పథకం కింద 36 కోట్ల 30 లక్షల రూపాయల నిధులతో పైప్ లైన్, వాటర్ సంప్ ఇతర పనులను చేపట్టేందుకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని అన్నారు. 2015 జూన్ 25న ప్రారంభమైన అమృత్ 1 పథకం కింద కేంద్ర ప్రభుత్వం తన వాటాగా 50 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని మంత్రి సంజయ్ పేర్కొన్నారు. అమృత్ స్కీం ద్వారా దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 1 కోటి 34 లక్షల నీటి కనెక్షన్ లు, 1 కోటి 2 లక్షల మురుగునీటి కనెక్షన్లు అందించినట్టు తెలిపారు. వీటితోపాటు 2 వేల 411 పార్కులను అభివృద్ధి చేసి, 62 లక్షల 78 వేల ఎల్ఈడీ లైట్లను మార్చుకున్నట్టు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విషయానికొస్తే అమృత్ 1, 2 కింద మొత్తం 852.11 కోట్లు కేటాయించగా అందులో కేంద్ర వాటా 481.19 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా 297. 55 కోట్లు మున్సిపాలిటీల వాటా 73.37 కోట్లు అన్నారు.అందులో భాగంగానే చొప్పదండి మున్సిపాలిటీలో అమృత్ 2 కింద 36 కోట్ల 30 లక్షల రూపాయల నిధులతో ఇంటింటికీ నీళు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో కేంద్ర ప్రభుత్వం 17 కోట్ల 89 లక్షలు, రాష్ట్రం వాటా 15 కోట్ల 11 లక్షలు, మున్సిపాలిటీ వాటా 3 కోట్ల 30 లక్షలు అన్నారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో చొప్పదండి పట్టణ ప్రజలకు ఇంటింటికీ నీటిని సరఫరా చేయబోతున్నాం. అతి త్వరలోనే చొప్పదండి ప్రజల దాహార్తిని తీర్చు తామని, కేంద్ర మంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని అన్నారు.



## మల్కాజ్గిరి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ కు ఎమ్మెల్యే వినతి

**మల్కాజ్గిరి ప్రజా తీర్పు ప్రతినిధి (వినోద్) :-**

మల్కాజ్గిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం జిహెచ్ఎంసి కమిషనర్ %=.ఎ%. కర్ణన్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఉన్న గౌతమ్ నగర్ డివిజన్, మల్కాజ్గిరి, మౌలాలి, నేరేడ్మెట్, ఈస్ట్ ఆనంద్ బాగ్, వినాయక్ నగర్, వెంకటాపురం, ఆల్వాల్, మచ్చ బొల్లారం డివిజన్ లలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహిళా సునీత రాము యాదవ్, మల్కాజ్గిరి డివిజన్ మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, నరేందర్, జేఏసీ వెంకన్న, మేకల రాము యాదవ్, బైరు అనిల్,సిద్ధి రాములు,కిట్టు, కృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్,తదితరులు ఉన్నారు

## నిర్మల్ నుండి అరుణాచలం రామేశ్వరానికి ఆర్టీసీ బస్సు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జూన్09 (ప్రజాతీర్పు)**



నిర్మల్ నుండి రామేశ్వరానికి సూపర్ లగ్జరి బస్సు నడుపు తున్నట్లు డిపోమేనేజర్ కే పండరి సోమవారం తెలిపారు. నిర్మల్ నుండి అరుణాచలం, పలని, మధురై, పాతల శెంబు, రామేశ్వరం ధనుష్కోడి యాత్రలకు బస్సు నడుపు తున్నట్లు ఆయనతెలిపారు. రామేష్వరమ్ వరకు బస్సు వెళ్లి తిరిగి అరుణాచలం గిరి ప్రదక్షిణ దర్శనం చేయించుని నిర్మల్ చేరుకుంటుందని ఆయన తెలిపారు.ప్రయాణపు తేదీ ఛార్జి వివ రాలకు 9959226003, 8328021517, 7382842582 సంప్రదించాలని తెలిపారు. అలాగే 36 మంది ప్రయాణికులు ఉంటే ఎక్కడికైనా బస్సు సౌకర్యం కలిపిస్తామని డిపోమేనేజర్ తెలి పారు

## మావోయిస్టు మైలారపు ఆడేళ్లు అంతఃక్రియల్లో పాల్గొన్న గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదావ్

- ఆపరేషన్ ఖగార్ పేరుతో అమాయకులను పొట్టనపెట్టుకోవడం సరికాదు
- కామ్రేడ్ ఆడేళ్లు కుటుంబానికి ప్రభుత్వం అదుకునేలా ఒత్తిడి తీసుకొస్తా

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్09(ప్రజాతీర్పు):**



బోథ్ మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన మావోయిస్టు మైలారపు ఆడేళ్లు ఛత్తీస్ గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఎన్ కౌంటర్ లో మృతి చెందారు. అడేళ్లు అంతఃక్రియలు సోమవారం వారి స్వగ్రామం పొచ్చరలో నిర్వహించగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అంతఃక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడేళ్లు మృతదేహానికి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంతఃక్రియలకు రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ ఆపరేషన్ ఖగార్ పేరుతో అమాయక బహుజనులను పొట్టనపెట్టుకోవడం సరికాదని వారితో చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆడేళ్లు కుటుంబానికి ప్రభుత్వం తరపున సహాయం అందేలా నియోజకవర్గ ఎమ్మెల్యే గా కొట్లాడి సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. వీరి వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి తో పాటు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు అధిక పాల్గొన్నారు.



## విద్యుత్ ఘాతంతో కాలి బూడిదైన ఆవుల షెడ్డు

**నర్సంపేట జూన్ 9 (ప్రజా తీర్పు)**

చెన్నారావుపేట మండలం లోని జల్లి గ్రామం లో విద్యుత్ ఘాతంతో కాలి బూడిదైన ఆవుల షెడ్డు ఈ ప్రమాదంలో దాదాపు లక్షకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు ఆవుల షెడ్డు నిర్వాహకుడు కాట కుమారస్వామి తెలిపారు.ఉదయం ఆవుల ను మేతకు పంపి లేగలను అందులో కట్టి వేయడం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కవడంతో షెడ్డు చుట్టూ కట్టిన పర్దాలు అంటుకొని షెడ్డు మొత్తం తగలబడింది. అంతలో నిర్వాహకుడు కాటా కుమారస్వామి తన భార్య పిల్లలు షెడ్డులో ఉండే ల్యాగలను వెంటనే విడవడంతో లేగలు పరిగెత్తడం జరిగింది. ఈ మంటలను చూసిన చుట్టుపక్కల వ్యవసాయ కూలీలు వచ్చి మంటలు ఆర్పి వేసిన అంతలోనే కాలి బూడిదయింది గతంలో కూడా అకాల వర్షాల వలన గాలికి కొట్టుకుపోయి అప్పుడు 40 వేల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ప్రస్తుతం ఇప్పుడు విద్యుత్ ఘాతం తో పూర్తిగా దగ్ధమైంది. కాబట్టి ప్రభుత్వం స్పందించి బాధితునికి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



## అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల, స్టాపర్ జూన్ - 09**

ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అర్జీలు తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖకు 51, హౌసింగ్ 32, ఏడీ ఎస్ఎల్ ఏ, డీఈఓ కు 7 చొప్పున, డిఆర్డీఓకు 6, జిల్లా సంక్షేమ అధికారి 5, జిల్లా పౌర సరఫరాల అధికారి, ఎస్సీ కార్పొరేషన్, ఉపాధి కల్పన శాఖకు మూడు చొప్పున, సిరిసిల్ల మున్సిపల్, ఎంపీడీఓ బోయినపల్లి కి రెండు చొప్పున ఎస్పీ, ఎస్డీసీ, నీటి పారుదల శాఖ, సెస్, ఎక్సైజ్ శాఖ, మిషన్ భగీరథ, ఎల్డీఎం, ఏడీ హ్యాండ్ లూమ్స్, సీపీఓ కి ఒకటి చొప్పున దరఖాస్తులు మొత్తం 134 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి, ఆయా శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో రాణిస్తున్న కరీంనగర్ వాసులకు బంగారు నంది అవార్డుల ప్రధానం

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ జోన్ 9 )**




తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పర్యావరణ దినోత్సవం, నేషనల్ ఫ్రెండ్షిప్ డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జిసిఎస్ వల్లూరి ఫౌండేషన్ శ్రీ ప్రగతి ఫౌండేషన్ సంయుక్తంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులైన నిష్ణాతులందరినీ గుర్తించి హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన కార్యక్రమంలో "జాతీయ బంగారు నంది అవార్డుల"తో సోమవారం సత్కరించింది. ఈ సందర్భంగా వైద్య రంగంలో విశేష సేవలందిస్తున్న స్థానిక వాసుదేవ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ప్రభుత్వ విభాగంలో ఇంజనీరుగా సేవలందిస్తున్న ఈద కుమారస్వామిని, ప్రైవేటు విభాగంలో ఇంజనీరుగా విశేష సేవలందిస్తున్న కోల అన్నారెడ్డి మాజీ మంత్రి సినీ ప్రముఖులు బాబు మోహన్, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి ఆచార్య దైవిజ్ఞ శర్మ మల్కాజ్ గిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ సినీ ప్రముఖులు దొరై స్వామి, దర్బార్ చంద్రశేఖర్ చేతుల మీదుగా బంగారు నంది అవార్డులతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులతో పాటు వివిధ రంగాలలో సేవలందించిన ప్రముఖులతోపాటు కార్యక్రమ నిర్వాహకులు శ్రీ ఫౌండేషన్, జిసిఎస్ వల్లూరి ఫౌండేషన్ అలాగే శ్రీ ప్రగతి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలయన్స్ ప్రతినిధులు పులాల శ్యామ్ గాలిపెల్లి నాగేశ్వర్ చరిమెల వెంకటేశ్వర్లు హైమవతి మహేష్ అల్లాడి ఆనంద్ కుమార్ సుద్దపల్లి ప్రసాద్ డాక్టర్ ఎం వసంతరావు డాక్టర్ రాజ్ కుమార్ డాక్టర్ పెంచలయ్య డాక్టర్ అరుణ్ కటారి డాక్టర్ రమణాచారి డాక్టర్ నగేష్ డాక్టర్ బి సునీల్ రాజ్ డాక్టర్ కృష్ణ చైతన్య డాక్టర్ సౌమ్య డాక్టర్ సాయి మేఘన డాక్టర్ సాయి ప్రీతం పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర తానా అసోసియేషన్ ప్రతినిధులు అవార్డు గ్రహీతలకు శుభాభినందనలు తెలిపారు.



## ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున కార్గే ని మర్యాదపూర్వకంగా కలిసిన వివేక్ కుటుంబం

**మంచిర్యాల జిల్లా ప్రజాతీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 9**

మంచిర్యాల జిల్లా: ఈ రోజు ఢిల్లీలో ఏఐసీసీ ప్రెసిడెంట్ శ్రీ.మల్లికార్జున్ ఖర్గే గారిని మర్యాదపూర్వకంగా కుటుంబ సమేతంగా కలిసిన మంత్రివర్యులు డా. జి వివేక్ వెంకటస్వామి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ.




## ప్రభుత్వ బడులను బలోపేతం చేసుకుందాం

**రామడుగు జూన్ 9, ప్రజా తీర్పు ప్రతినిధి**

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమములో భాగంగా రామడుగు మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ఉపాధ్యాయ బృందం సోమవారం ఇంటింటికీ తిరిగి బడిబాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను తల్లిదండ్రులకు, గ్రామ పెద్దలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పరిరక్షణ వాటి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జూన్ 6వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు రోజు వారీగా షెడ్యూల్డ్ రూపొందించి విద్యార్థుల సంఖ్య పాఠశాలలో గణనీయంగా పెంచాలనీ విద్యార్థుల తల్లిదండ్రులను గ్రామ పెద్దలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు నాణ్యమైన విద్యాబోధనలు , మధ్యాహ్న భోజనము సౌకర్యము వారానికి మూడుసార్లు ఎగ్స్. రాగిజావాలంటి మౌలిక వసతులు కల్పిస్తుందని వివరించారు. అంతేకాకుండా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కు (21 రకాల దివ్యాంగ విద్యార్థులకు) చదువు చెప్పుటకు మన ఎంపీ పీఎస్ పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయుడిని నియమించామన్నారు. దివ్యాంగ విద్యార్థులు పాఠశాలలో చదువుకొనుటకు మంచి అవకాశం కల్పించారని, రామడుగు, కొరటపల్లి, గోలిరామయ్య పల్లి గ్రామాలలో 57 మంది బడి ఈడు విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలలో చేరే విధంగా ప్రోత్సహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి హరిత, సీహెచ్ విజయ లక్ష్మీ, డి కవిత, స్పెషల్ ఎడ్యుకేటర్ కె వెంకటేశ్వర రావు, రఘువీర్, ఎంపీపీఎస్ రామడుగు కొత్త స్కూల్ హెడ్మాస్టర్ డి సురేఖ, ఐఈఆర్పీ తిరుమల, సిఆర్పి హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి సిద్ధమైన ఎల్.ఏ (లక్ష్మీ ఆంజనేయ) గార్డెన్

**ఖానాపురం జూన్ 9 (ప్రజా తీర్పు)**

మండలం లోని ధర్మరావుపేట గ్రామంలో లక్ష్మి ఆంజనేయ గార్డెన్ (ఎల్.ఏ గార్డెన్ ) నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైందని లక్ష్మి ఆంజనేయ గార్డెన్ యజమాని.జంపుల అంజనేయులు తెలిపారు. ఈమేరకు జంపుల అంజనేయులు - భాగ్యలక్ష్మి ,దయాకర్ శీరిష ,తాళ్ళ శిల్ప- రజినీకాంత్ (యుఎస్ ఏ ) ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మీ ఆంజనేయ గార్డెన్ యజమాని జంపుల అంజనేయులు మాట్లాడుతూ వివాహాది శుభకార్యాలు, పుట్టిన రోజు వేడుకలు తదితర అన్ని రకాల శుభకార్యాలకు అనుకూలంగా విశాలమైన ప్రత్యేక గదులతో ధర్మరావుపేట శివారులో నిర్మించడం జరిగిందన్నారు. ఖానాపురం మండలంలోని ధర్మరావుపేటతో పాటు పలు గ్రామాలకు అందుబాటులో సువిశాల స్థలంలో నిర్మితమైన నూతన ఫంక్షన్ హాల్ ను సద్వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.





## ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను పంపిణి చేసిన ప్రభుత్వ విప్

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్, చందుర్తి జూన్ 9**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల పరిధిలోని అర్హులైన 89 మంది లబ్దిదారులకు 29 లక్షల 33 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు..



## పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులందరి దరఖాస్తులు తీసుకోవాలి

**ఖానాపురం మండలం జూన్ 9 (ప్రజా తీర్పు)**

మండలంలోని అశోక్ నగర్ గ్రామంలో రెవెన్యూ సదస్సులో గ్రామంలోని రైతుల రెవిన్యూ సమస్యలపై అలాగే పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులందరి దరఖాస్తులు తీసుకోవాలని నర్సంపేట ఆర్డీవో తో మాట్లాడి మళ్లీ అశోక్ నగర్ గ్రామంలో రెవెన్యూ గ్రామసభ ఈ నెల 16వ తేదీన నిర్వహించేటట్లు ఆర్డిఓ తో చర్చించి 16వ తేదీ మళ్లీ తిరిగి గ్రామ సభ అశోక్ నగర్ గ్రామంలో నిర్వహించేతట్టుగా మాట్లాడిన సిపిఎం జిల్లా నాయకులు భూక్య సమ్మయ్య అశోక్ నగర్ గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ మండల నాయకుడు కుదురుపాక రాములు, చింతకింది తిరుపతి, బసనబోయిన చంద్రు, మారం విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు



## సోంతింటి కళ "ఇందిరమ్మ ఇండ్ల" తో సకారం.. మనకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్తనారాయణ సహకారంతో

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ జూన్ 9**

నిరుపేదలకు సోంతింటి కళ "ఇందిరమ్మ ఇండ్ల" తో సకారం అవుతుందని ఇల్లంతకుంట ఎంపీడీఓ వై.శశికళ అన్నారు. సోమవారం రేపాక గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేసిన్నారు.మాజీ ఎంపీటీసీ కాత సుమలత, మల్లేశం హౌస్యింగ్ ఏ ఈ శ్రీజ గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్,గూడ బాబు, ఎట్ల ఐలయ్య లతో కలసి ముగ్గు పోశారు. లబ్దిదారులు ఆకుల హ్రీమ మాసం మౌనిక సొల్లు హర్షిత యాగండ్ల కతమ్మా ఎట్ల రవళి బొల్లం విజయలక్ష్మి బొడిగే శ్రావణి మరో 10 మంది లబ్ది దారులకు లకు ముగ్గు పోసారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు , తదితరులు పాల్గొన్నారు.



## వార్డుల విభజనలో లోపించిన పారదర్శకత వెంటనే సవరించాలని డిమాండ్ ...

### నర్సంపేట మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన ఎం సిపిఐ (యు) నాయకులు ...

**నర్సంపేట జూన్ 9 (ప్రజా తీర్పు)**

నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల విభజన లో పారదర్శకత పూర్తిగా లోపించిందని ఎం సిపిఐ( యు) నాయకులు కన్నం వెంకన్న ,వంగల రాగ సుధా, కొత్తకొండ రాజమౌళి ఆరోపించారు . ఈ సందర్భంగా 9-6-2025 న నర్సంపేట మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.ఇటీవల కొన్ని గ్రామాలను నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం చేయగా , ఆ గ్రామాల ఓటర్లను రెండు మూడు వార్డుల్లో వేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు గ్రామాల విలీనం తో ఒకవైపు ప్రజలు ఉపాధి కోల్పోగా,ఇది చాలదన్నట్టు ప్రజలను మరింత అస్థిరపరిచేందుకు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.అదే రకంగా పట్టణంలోని జ్యోతిబాసు నగర్ , కారల్ మార్క్స్ కాలనీలో చాలా ఏళ్లుగా సమస్యలు వెంటాడుతున్నాయని ఈ సమస్యలను పరిష్కరించడంలో పాలకవర్గాలు ఘోర వైఫల్యం చెందారన్నారు.ఇప్పటికైనా కాలనీలో అంతర్గత రోడ్లు డ్రైనేజీ వ్యవస్థను వెంటనే పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు లేనిపక్షంలో దశలవారి ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐసిటియు జిల్లా అధ్యక్షులు ఎండి మాషూక్,పట్టణ నాయకులు భైరబోయిన నరసయ్య,బెజ్జంకి పుష్పనీలా,జన్ను విజయ తదితరులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు...

**( ప్రజా తీర్పు ప్రతినిధిజమ్మికుంట): జూన్: 9: సోమవారం:**

కులం పేరుతో దూషించిన వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట సీ.ఐ .సుదగాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. తనువుల గ్రామానికి చెందిన జూపాక ప్రశాంత్ అతడి చెల్లి జూపాక పల్లవి బూతునూరు కి చెందిన తోడేటి అజయ్ గౌడ్ అనే వ్యక్తిని ప్రేమించగా పెద్దల సమక్షంలో వివాహం జరిపించగా బూజునూరు గ్రామానికి చెందిన1 .మాచర్ల రాకేష్, 2.మామిడి సాయి కుమార్, 3కొత్వాల కళ్యాణ్, 4తోడేటి పవన్, 5రౌతు రాకేష్, 6ఇల్లందుల రమేష్ అనువారు భోజనాల దగ్గర గొడవ చేసి ఫిర్యాది యొక్క తమ్ముళ్లు అయిన హరీష్, పవన్ కళ్యాణ్ లను చేతులతో ఇష్టం వచ్చినట్లు కొట్టి కులం పేరుతో దూషించగా వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీ.ఐ .సుదగాని రామకృష్ణ గౌడ్ తెలిపారు.

# మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా చర్యలు:జిల్లా కలెక్టర్

- 190 వరి కొనుగోలు కేంద్రాల ద్వారా 470 కోట్ల విలువ గల 2.2 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు
- మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కోసం దాదాపు 7 కోట్ల కమిషన్ లబ్ది
- ప్రతి మండలంలో 2 విత్తనాలు,ఎరువుల షాప్ మహిళా సంఘాల ద్వారా ఏర్పాటుకు కృషి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించడం పై మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పాల్గోన్న జిల్లా కలెక్టర్



**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల, స్టాపర్ జూన్ 09**

మహిళలను కోటిశ్వరులు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించడం పై మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో పాల్గోన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు సీజన్ నందు జిల్లాలో మహిళా సంఘాలకు 190 కోనుగోలు కేంద్రాల బాధ్యతలను కలెక్టర్ అప్పగించడంతో రికార్డు స్థాయిలో 470 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశారు. మహిళా సంఘాల కు లాభం చేకూర్చేలా ధాన్యం కొనుగోలు బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్ కు మహిళా సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా జిల్లా కలెక్టర్ ను మహిళా సంఘాల సభ్యులు శాలువా, మొమెంటో తో సన్మానించారు.

అనంతరం విజయవంతంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించిన మహిళా సంఘాల సభ్యులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ...గతంలో 42 కొనుగోలు కేంద్రాల మాత్రమే మహిళా సంఘాల నిర్వహించేవారని, తాను కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత యాసంగి కోనుగోలు సీజన్ నందు అత్యధికంగా 190 కోనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించడం జరిగిందని, చాలా మంది అంచనాలకు విరుద్ధంగా మహిళా సంఘాల విజయవంతంగా యాసంగి కొనుగోలు ప్రక్రియ చేపట్టారని కలెక్టర్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల మహిళా సంఘాలకు అప్పగించామని కలెక్టర్ అన్నారు. యాసంగి సీజన్ లో మహిళలకు దాదాపు 7 కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ వచ్చిందని, ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాబోయే ధాన్యం కొనుగోలు సీజన్ నందు మహిళా సంఘాలకు 220 కంటే ఎక్కువ కోనుగోలు కేంద్రాల అప్పగిస్తామని అన్నారు.రవాణా, హామాలీ సమస్య పరిష్కారం కోసం మహిళలు ముందస్తుగా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు యాసంగి సీజన్ నందు మహిళా సంఘాలతో ఎటువంటి సమస్య రాలేదని, భవిష్యత్తులో కూడా ఇదే పని తీరు కోనసాగించాలని కలెక్టర్ సూచించారు. మహిళలకు విత్తనాలు, ఎరువుల లైసెన్స్ కూడా అందిస్తామని అన్నారు. ప్రతి మండలంలో కనీసం 2 విత్తనాలు ఎరువులు షాపులను మహిళలకు కేటాయించాలని లక్ష్యంతో ఉన్నామని, మహిళా సంఘంలో అర్హులై ఉండి ఎవరికైనా ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎరువుల, విత్తనాల విక్రయంతో మహిళా సంఘాలకు మంచి లాభం వస్తుందని అన్నారు. మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా 192 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించడం వల్ల అధికంగా కమిషన్ లభించిందని, జిల్లా కలెక్టర్ తమ పై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ విజయవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసామని అన్నారు. మహిళా సంఘాలపై నమ్మకంతో 190 కొనుగోలు కేంద్రాలు కేటాయించినందుకు జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ సమస్యల పై కలెక్టరేట్ కు వచ్చే ప్రజలకు సౌకర్యార్థం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద సమీకృత జిల్లా కార్యాలయ సమావేశం మందిరం ఆవరణలో శ్రీ రాజ రాజేశ్వర మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన జిరాక్స్ సెంటర్ ను కలెక్టర్ ప్రారంభించారు.కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ. శేషాద్రి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రజిత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలి బేగం, అదనపు డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, సంబంధిత అధికారులు , సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే – ప్రజా ప్రభుత్వ ధ్యేయం:కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ ముస్తాబాద్ జూన్ 9**



పేదింటి కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్న ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏళ్ళ బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని మోహిని కుంట గ్రామంలో మరియు గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు, నాయకులు ముగ్గు పోశారు. అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన సాగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ఆరు గ్యారంటిలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ముగ్గు పోసిన సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులైన మోహిని కుంట గ్రామంలో బిల్లం లక్ష్మి, సూత్రపు లావణ్య, ఎనగంటి రాధ, గూడెం గ్రామంలో బొప్ప స్వప్న, పన్నీరు కనుకవ్వ లకు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ గత పది సంవత్సరాల్లో మాకు ఎలాంటి న్యాయం జరగలేదని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లోనే మాకు ఇందిరమ్మ ఇల్లు రావడం చాలా సంతోషంగా ఉంది అన్నారు.ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు జిల్లా నాయకులు మండల నాయకులు గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ ప్రభుత్వం దళితులను మోసం చేసింది: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ వేములవాడ జూన్ 9**



10 ఏళ్ల పాలనలో టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం దళితులను మోసం చేసింధని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుర్ర రవితేజ అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుర్ర రవితేజ గౌడ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేసిందని,ఉపముఖ్యమంత్రి,స్పీకర్ సహా ముగ్గురు మంత్రులున్నారు. మరో మూడు మంత్రి పదవుల్లో మున్నూరు కాపు సామాజిక వర్గానికి కూడా అవకాశం లభిస్తుందని వేములవాడ నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారన్నారు.మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావున,వారిని బలంగా ఎదుర్కొనేందుకు మంత్రి పదవి, కేకే మహేందర్ కి ఎమ్మెల్సీ పదవి ఇస్తే బాగుంటుందని నియోజకవర్గ కార్యకర్తలు కోరుతున్నారని అన్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు వైస్సార్ హయాంలో ఇస్తే మళ్ళీ కాంగ్రెస్ వచ్చాకే పేదోడి సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. రాష్ట్రంలో రాజన్న జిల్లాకే అత్యధిక ఇందిరమ్మ ఇళ్ళు శాంక్షన్ అవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆది శ్రీనన్న అత్యధిక సంఖ్యలో సీఎంఆర్ఎఫ్ నిధులు తెస్తున్నారని తెలిపారు... దొడ్డు బియ్యం బదులు ప్రతి ఇంటికి నేడు సన్న బియ్యం ఇస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని కొనియాడారు..ఈ కార్యక్రమంలో ఇమ్మడిశెట్టి విశాల్, కవ్వంపెల్లి నరేశ్, సన్నీ, సోఫియాన్, జీవాన్న తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటిష్ దౌర్జన్యాలను ఎదిరించిన వీర యోధుడు బిర్సా ముండా

- 125వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన
- ఆదివాసి సంక్షేమ పరిషత్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు కుంజా రమాదేవి
- మహా జన సమితి ఆదివాసి మహిళ కన్వీనర్ కంగాల రమణకుమారి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి ( సందీప్) జూన్ 09**

బిర్సా ముండా 125 వ వర్ధంతి వాళ్ల కేంద్రం ఏరియాలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు కుంజా రమాదేవి మహా జన సమితి రాష్ట్ర మహిళా కన్వీనర్ కంగాల రమణకుమారి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిర్సా ముండా యొక్క నాయకత్వం, అతి చిన్న వయసులో చేసిన గిరిజన ఉద్యమ సారధ్యన్నీ స్మరించుకున్నారు. 19వ శతాబ్దపు చివరి రోజుల్లో, నేటి బీహార్, ఝూర?ండ్ ఆటవి ప్రాంతాల్లో, బ్రిటిషు కాలంలో జరిగిన మిలీనేరియన్ ఉద్యమానికి సారథ్యం వహించాడని, 22 ఏళ్ల వయసు 1897 లోనే బ్రిటీషర్లపై యుద్ధం ప్రకటించి బ్రిటిషర్లును గడగడ లాడించిన యోధుడినీ గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ కూడా ఆదివాసీల కోసం పోరాటం చేసిన యోధులను ఎవరు కూడా మర్చిపోకుండా వారి ఉద్యమాలను స్పూర్తిగా తీసుకొని ముందు తరాలకు ఉద్యమ స్పూర్తిని ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమానికి మంజుల, కృష్ణవేణి, వేణి, దీపిక, దుర్గారావు, కనక ,కామాక్షి, ఆదిలక్ష్మి, దుర్గ, దేవి, శృతి, సుజాత తదితరులు పాల్గొన్నారు..

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి దోహదపడుతుంది

**జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్,**

**సిద్దిపేట జిల్లా(, జూన్)ప్రజా తీర్పు ప్రతినిధి,,,,**



సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ఫిర్యాదుదారుల నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు అర్జిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్ల మరియు ఇతర అర్జిలు మొత్తం 88 వచ్చాయి. అర్జిదారులకు న్యాయం చేసి తిరిగి అర్జి పెట్టుకోకుండా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమానికి శ్రీకారం, రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

### జిల్లా కలెక్టర్, డాక్టర్ సత్య శారద

**నర్సంపేట జూన్ 9 (ప్రజా తీర్పు)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. సోమవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కన్నరావుపేట, నందిగామ గ్రామాలలో బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులు,టెక్స్ట్,నోట్ బుక్స్ ఉచితంగా అందిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను వీటి పట్ల అవగాహన కల్పించాలని, బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న దృష్ట్యా తరగతి గదులతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కన్నారావుపేట ప్రాథమిక పాఠశాలకు వెంటనే ప్రహరీ గోడ నిర్మించుటకు చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యులను ఆదేశించారు. ఈ సందర్భంగా నందిగామ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, కేంద్రం నిర్వహణ సక్రమంగా లేనందున పాఠశాలలోని ఒక



గదిని ఏర్పాటు చేసి అందులోకి మార్చాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

**రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి:కలెక్టర్**

భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. కన్నారావుపేట,నందిగామలలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను కలెక్టర్ సందర్శించి దరఖాస్తు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో డీఈవో జ్ఞానేశ్వర్,ఎం ఈ ఓ అనురాధ, తహసిల్దార్, ప్రధానోపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కేరళ తరహాలో పట్టణ ప్రాంతాలలో ఉపాధి హామీ పని కల్పించాలి, పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 9)**

కేరళ తరహాలో పట్టణ ప్రాంతాలలో గ్రామీణ ఉపాధి హామీ పని కల్పించాలని అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న కూలీలకు పాత బకాయిలు అందించాలని. ఈరోజు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న కార్మికులకు వారం వారం కూలీ ఇవ్వాలని పని ప్రదేశాలలో వసతులు కల్పించాలని సమ్మర్ ఆల్వేస్ రోజు కూలి 600 రూపాయలు 200 రోజులు పని దినాలు కల్పించాలని. ఫీల్డ్ అసిస్టెంట్ లేని చోట సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో పని లేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉన్నదని వెంటనే మున్సిపాలిటీ కార్పొరేషన్లలో పేద ప్రజలను గుర్తించి వారికి పని కల్పించాలని వారి ఆవేదన వ్యక్తం చేశారు. కల్పించని యెడల కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాయి కంటి శ్రీనివాస్ ,మాతంగి శంకర్, సహాయ కార్యదర్శి సుంకరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల ప్రక్రియ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 9)**



జిల్లాలోని వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియం ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులు, ఎంపీడీవోలతో ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన పై సమీక్షించారు. వివిధ కార్యక్రమాలు, పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడలు, టాయిలెట్స్, కిచెన్ షెడ్, వివిధ ప్రభుత్వ భవనాల మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణాలకు పనులు మంజూరు చేశామని తెలిపారు. ఈ పనులకు సంబంధించిన గ్రౌండింగ్ 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఏఈలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనులు మొదలయ్యేలా చూడాలన్నారు. ఇది వరకే మొదలైన పనులను వేగవంతం చేసి రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంకా అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడి కేంద్రాలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాల్లోకి తరలించాలని ఆదేశించారు. అక్కడ అవసరమైన మరమ్మతులు చేయిస్తామని, టాయిలెట్స్ నిర్మిస్తామని, నీటి వసతి కల్పిస్తామని అన్నారు. ఎంపీడీవోలు, సిడిపివోలు సమన్వయంతో తరలింపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభమవుతున్నందున మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు అన్ని ప్రభుత్వ పాఠశాలలను, వసతి గృహాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. వర్షం కారణంగా నీరు నిలవకుండా చూడాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను తనిఖీ చేయాలని సూచించారు.

**ప్రజావాణికి 304 దరఖాస్తులు**

ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. 304 మంది అర్జీలు సమర్పించగా కొన్ని దరఖాస్తులు అక్కడికక్కడే పరిష్కరించారు. ఆన్లైన్లో పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారులు వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, డి.ఎం.డబ్ల్యూ.ఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సత్తు మల్లేష్ కు రచయితలు అందచేయబడిన పుస్తకాలు

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 9)**



కరీంనగర్ పట్టణంలోని కేంద్ర గ్రంథాలయం లో పాఠకులకు అందుబాటులో ఉంచడానికై వేములవాడకు చెందిన లాలా లింగమూర్తి.. ఒకప్పుడు విడాకుల వ్యవస్థ లేదని ఆంగ్లేయుల ప్రభావంతో భారత్ లోకి వచ్చి ఈ మధ్య కాలముల్లో విపరీతంగా పెరిగిపోతున్నాయని "విడాకులకు వ్యతిరేకంగా" రచించిన మళ్ళీ పెళ్ళి కథలు అనే పుస్తకములు 41, వేములవాడ రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు అయిన అన్నయ్య నూగుల రచించిన శబరిగిరి నివాస శతకం అనే పుస్తకాలన్ను జిల్లా గ్రంథాలయ సంస్థ, కరీంనగర్ అధ్యక్షులు సత్తు మల్లేష్ కు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రచయిత లాలా లింగమూర్తి, లైబ్రేరియన్ సరిత, గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్కారు బడుల్లో చదివిస్తేనే పిల్లలకు బంగారు భవిత

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారెందరో ఈ దేశానికి దిక్సూచి అయ్యారు
- శాంతినగర్ లో అధికారులు స్థానికులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 9)**

సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన ఉపాధ్యాయుల సమక్షంలో విద్యను అభ్యసించే అవకాశం ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటుందన్న విషయం తల్లిదండ్రులు గ్రహించాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్వంత ప్రచార వాహనంతో ప్రచారం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరిస్తూ కొత్తగా చేరిన పది మంది విద్యార్థులకు ప్రోత్సాహకంగా స్కూల్ బ్యాగులు స్వయంగా పంపిణీ చేశారు. శాంతినగర్ లో జిల్లా విద్యాధికారి మొండయ్యతో కలిసి అధికారులు స్థానికులు తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సుడా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల యొక్క ప్రాధాన్యతను తల్లిదండ్రులు గుర్తించాలని ఈ దేశాన్ని



అభివృద్ధి పథంలో నడిపించిన మేధావులు అన్ని రంగాలకు చెందిన వారు ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టామని రాబోయే రోజుల్లో ఇంకా మెరుగైన సౌకర్యాలు ఈ ప్రభుత్వం కల్పిస్తుందని నరేందర్ రెడ్డి అన్నారు. చింతకుంట శాంతినగర్ గాంధీనగర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పలు సమస్యలను నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన నరేందర్ రెడ్డి బాత్రూంలు, వంటశాలల లాంటి సమస్యలు సుడా నిధులతో పరిష్కరిస్తామని క్లాస్ రూంలు, ప్రహరీ గోడకు సంభందించి కలెక్టర్ తో చర్చించి పరిష్కరిస్తానని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 19 వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాలలో కొనసాగిస్తామని నరేందర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆనందం, ప్రధానోపాధ్యాయులు, స్థానిక నాయకులు మడుపు మోహన్, శ్రవణ్ నాయక్, లక్ష్మీనారాయణ, అనిల్ కుమార్, సుజాత, నిర్మల, రంగానాయక్, సత్యం గౌడ్, అజీమ్ నూర్, జమీర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులను కలిసిన ఎల్లారెడ్డిపేట దేవాలయ నిర్మాణ కమిటీ

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ ఎల్లారెడ్డిపేట జూన్ 9**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా రాష్ట్ర దేవదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు నంది కిషన్ తో కమిటీ సభ్యులు సోమవారం కలిశారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ గుడికి సంబంధించిన పత్రాలను కరీంనగర్ లోని ఎండోమెంట్ డిపార్ట్మెంట్ అధికారులకు అందజేసి అనంతరం వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసంలో కలిసి ఆలయం నిర్మాణం త్వరగా అయ్యే విధంగా చూడాలని కోరారు. ఇందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందిస్తూ నిర్మాణంలో భాగంగా పత్రాలను పరిశీలించి కొత్తగా ఎస్టిమేట్ వేసిన తర్వాత అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభమయ్యే విధంగా చూస్తానని తెలియజేశారు. అధికారులను కలిసిన వారిలో నంది కిషన్ ఆధ్వర్యంలో ముత్యాల ప్రభాకర్ రెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి,సనుగుల ఈశ్వర్ తదితరులు వీరి వెంట ఉన్నారు.



## జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం

**(పడకంటి శ్రీనివాస్, ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్ జూన్ 9)**

సోమవారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని మూడవ డివిజన్ కు చెందిన దుర్షెడ్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్ రావు జిల్లా కలెక్టర్ పమేల సత్పత్తిని కలసి డివిజన్ పునర్విభజనకు సంబంధించిన అంశంపై వారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంపత్ రావు మాట్లాడుతూ దుర్షెడ్ గ్రామాన్ని నగరపాలక సంస్థలో విలీనం చేసిన తర్వాత డివిజన్ పునర్విభజనలో భాగంగా చేసినటువంటి డి లిమిటేషన్ ప్రక్రియ సక్రమంగా జరగలేదని పూర్తి అశాస్త్రీయంగా ఉందని డివిజన్ నెం. 3 లో దుర్శేడ్ మరియు గోపాల్పూర్ గ్రామంలోని కొన్ని గృహాలు చేర్చబడ్డాయి, అయితే దుర్శేడ్ గ్రామానికి చెందిన గృహ నంబర్లలో కేవలం 5-1 నుండి 5-20 వరకు మాత్రమే పొందుపరిచారు. కాని రెవెన్యూ రికార్డుల ప్రకారం దుర్శేడ్ గ్రామ పరిధి 5-1 నుండి 5-78/1 వరకు విస్తరించి ఉన్నదని స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. కాబట్టి ఈ కారణంగా 5-21 నుండి 5-78/1 వరకు గల గృహాలు ఏ డివిజను చేర్చబడ్డాయన్న విషయంపై స్పష్టత లేక ప్రజల్లో అయోమయం ఏర్పడిందన్నారు. ఇది స్థానిక పరిపాలన మరియు ప్రజాప్రతినిధుల దైనందిన కార్యకలాపాలపై ప్రభావం చూపించే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చెసారు. ఇది మాత్రమే కాకుండా, దుర్శేడ్-గోపాల్పూర్ పోలింగ్ స్టేషన్లు 104 నుండి 111 వరకు కలిపి చూసినప్పుడు ప్రతిపాదిత డివిజన్-3 లో ఓటర్ల సంఖ్య 5970గా ఉండాలి, కాని మున్సిపల్ ముసాయిది నోటిఫికేషన్లో కేవలం 5037 ఓటర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. దీన్ని బట్టి 937 ఓట్ల సమాచారం స్పష్టంగా లేదన్నారు. ఈ ఓట్లు ఏ డివిజన్లో కలిపినారో కూడా తెలియడం లేదని, డాటా లోపమా లేదా కావాలని చేసారా అనే అనుమానం తలెత్తుతుందన్నారు. అదేవిధంగా, మున్సిపల్ నియమావళి ప్రకారం ఒక డివిజన్ ఏర్పాటులో 100 అడుగుల రహదారి వంటి భౌగోళిక విభజనల ఆధారంగా ఏర్పాట్లు చేయాలని ఉంది, కానీ గోపాలపూర్ మరియు దుర్శేడ్ మధ్య 100 అడుగుల రాజీవ్ (స్టేట్ హైవే) రహదారి ఉన్న నేపథ్యంలో వీటిని కలిపి ఒకే డివిజన్ గా చేయడం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా చేయడం అనేక అనుమానాలకు తావిస్తోందని వారు ఆరోపించారు. మరీ ముఖ్యంగా గుంటూరుపల్లి గ్రామానికి సంబందించి ఇంటి పర్మిషన్లు గతంలో దుర్శేడ్ గ్రామ పంచాయితి నుండి ఇవ్వడం జరిగినదని గుర్తు చేశారు. దుర్షెడ్, గోపాలపురం గ్రామాల డివిజన్లు ఒకటి చేస్తే మౌళిక సదుపాయాలు నిర్వహణ, పారిశుధ్యం పనులు, నిర్వాహణ విద్యుత్ దీపాల ఏర్పాట్లు, అభివృద్ధి పనుల తారతమ్యాలు తలెత్తి ప్రజలకు తరచూ ఇబ్బందులు ఉంటాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డీలిమిటేషన్ ప్రక్రియ శాస్త్రీయంగా చేపట్టాలని వారు గ్రామ ప్రజల తరుపున డిమాండ్ చేశారు.



## సొంతింటి కల సాకారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం...

**(ప్రజా తీర్పు ప్రతినిధిజమ్మికుంట): జూన్ జూన్: 9: సోమవారం:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 5.వ,8.వ,22.వ వార్డులలో ఇందిరమ్మ ఇ%శీ%డ్లు మంజూరు అయిన లబ్ధిదారులకు సోమవారం కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని, ప్రజా ప్రభుత్వంలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన సాగుతుందనీ అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ఆరు గ్యారంటిలను అమలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, పొన్నం ప్రభాకర్ కి, నియోజవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబు కి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు సుంకర రమేష్ జమ్మికుంట మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు,పూదరి రేణుక శివకుమార్ గౌడ్, ఎండి సజ్జు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుల్లి ప్రతాప్, పాతకాల ప్రవీణ్, అనిల్,ఐదవ వార్డు అధ్యక్షుడు అశోక్ చంచల శ్రీనివాస్, ములుగురి రమేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.



## ఎలక్షన్ సీఈవో సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

**సిద్దిపేట జిల్లా, (జూన్)ప్రజా తీర్పు ప్రతినిధి,,,**

ఎలక్షన్ సీఈవో సుదర్శన్ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, బి ఎల్ ఓ లకు ఐడి కార్డుల జారీ తదితర అంశాలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి మాట్లాడుతూ 1200 అంతకంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతు బద్ధీకరించి కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆ పోలింగ్ కేంద్రాల్లో కొత్త %దీూా% ను నియమించడం జరుగుతుందని, %దీూా% లు అందరికి ఐడి కార్డ్స్ జారీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, అబ్దుల్ హమీద్, ఆర్డిఓలు సదానందం, రామ్మూర్తి, చంద్రకళ పాల్గొన్నారు

## లైన్స్ క్లబ్ ఆఫ్ తొలి మహిళ అధ్యక్షురాలుగా కమల రాజశేఖర్

- ఆధ్యాత్మిక, సేవ రంగంలో విశిష్ట సేవలు అందించిన కమలా రాజశేఖర్
- ఆదివారం రాత్రి ప్రమాణస్వీకారం చేసిన నూతన కార్యవర్గ సభ్యులు
- పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరావు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి (సందీప్) జూన్ 9 :**




భద్రాచలం కమ్మ సత్రం నందు లయన్స్ క్లబ్ అఫ్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ నూతన కమిటీ 25-26 సంవత్సరానికి గాను 32వ అధ్యక్ష,కార్యవర్గ ప్రమాణ స్వీకారం కా ర్య క్ర మం నిర్వహించారు. లయన్స్ క్లబ్ తొలి అధ్యక్షులుగా కమల రాజశేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. కమల రాజశేఖర్ చదువుకునే రోజుల్లోనే పలు సేవా కార్యక్రమాలు చేపట్టే వారిని తన సన్నితులు పేర్కొన్నారు. బి ఏ చదివిన కమలా రాజశేఖర్ తన తండ్రి వైద్యులు కావడంతో పేదవారి కష్టాలు ఎలా ఉంటాయో కళ్లారా చూసిన వ్యక్తి. చదువు అయిపోయిన తర్వాత భద్రాచలం ఏజెన్సీ ప్రాంతమైన దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం గ్రామానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు పిన్నింటి రాజశేఖర్ తో వివాహం జరిగింది. భద్రాచలం ఏజెన్సీ అంటేనే గిరిజను ఎక్కువగా ఉండే ప్రాంతం, మొదట్నుంచి కమల రాజశేఖర్ కి సేవ చేయటం అంటే చాలా ఇష్టం, వివాహం అయిన తర్వాత డాక్టర్ రాజశేఖర్ కూడా ప్రోత్సహించడంతో పేద మధ్యతరగతి ప్రజలకు సేవ చేయటం అదృష్టంగా భావించిన కమల రాజశేఖర్, 2011లో వికాస తరంగణి సంస్థ ద్వారా ఆధ్యాత్మిక సేవా రంగంలో తొలి అడుగులు వేస్తూ, ఈ రోజున శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సేవలో ప్రతిరోజు సేవ చేస్తూ భక్తులకు తన ఒత్తుగా సాహసకాలలో అందిస్తూ వస్తున్నారు. లైన్స్ క్లబ్ మెంబర్గా 32 సంవత్సరాలుగా కొనసాగుతూ 2025,26 సంవత్సరానికి గాను లైన్స్ క్లబ్ తొలి మహిళ అధ్యక్షురాలు కావడం విశేషం. దుమ్ముగూడెం మండలంలోని సొంత గ్రామం లక్ష్మీనరం, ఉన్నంబట్టి గ్రామాల్లో ఆలయాలను నిర్మించి భక్తులకు స్వామివారి సేవలను అందేందుకు దోహదపడ్డారు. భద్రాచలం పట్టణంలోని బస్టాండ్ వెనక శివానంద ఆశ్రమం అధ్యక్షురాలుగా కొనసాగుతూ ఎంతోమంది అనాధలకు చేయూతని ఇస్తున్నారు. కమల రాజశేఖర్ గోదారి వరదల సమయంలోనూ కరోనా సమయంలోను ప్రజలకు పలు రకాలుగా సేవలందించారు. ఆమె లైన్స్ క్లబ్ తొలి మహిళ అధ్యక్షురాలు కావడం పట్ల రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు ,వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## రైతులు భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి... తహసిల్దార్ వెంకట్ రెడ్డి...

**(ప్రజా తీర్పు ప్రతినిధి జమ్మికుంట): జూన్: 9: సోమవారం:**

రైతుల భూ సమస్యల పరిష్కారానికే అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని రైతులు భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట మండల తాహసిల్దార్ నల్ల వెంకటరెడ్డి అన్నారు. సోమవారం జమ్మికుంట మండలంలోని వావిలాల నగురం ,,నాగారం, పాపక్కపల్లి గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ నల్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారం కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టం రూపొందించారని దీని ద్వారా ప్రతి రెవెన్యూ గ్రామంలో రైతు సదస్సులు నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ నల్ల వెంకట్ రెడ్డి తెలిపారు. వావిలాల, నగురం నాగారం, పాపక్కపల్లి, గ్రామాలలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు గ్రామంలోని రైతులు (161) దరఖాస్తులను రెవెన్యూ అధికారులకు అందించారని తెలిపారు. రైతు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని దీనిపై ప్రజలకు గతంలోనే అవగాహన కల్పించడం జరిగిందని ఇప్పుడు ప్రతి రెవెన్యూ గ్రామంలో జరగబోయే భూభారతి సదస్సుకు ముందు రోజే మా సిబ్బంది ఆ గ్రామంలో ఉన్న రైతులకు అవగాహన కల్పించి వారికి అప్లికేషన్లు అందించడం జరుగుతుందని రైతు సమస్యలను అప్లికేషన్ ద్వారా సదస్సులో అందిస్తే సరిపోతుందని తహసిల్దార్ తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో సదస్సులు నిర్వహించడం రైతులు సహకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మార్కెట్ చైర్పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం తహసిల్దార్ వెంకట్ రెడ్డి డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు గడ్డం శంకర్, సత్యనారాయణ, ఎంపిఎస్ఓ రెవిన్యూ సిబ్బంది సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ

**ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి (సందీప్) జూన్ 09**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం తెలంగాణ స్కూల్ ప్రాంగణంలో మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అలింకో వారి సౌజన్యంతో సామాజిక అధికారిత శివిర్ దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం తెలంగాణ స్కూల్ పాత కొత్తగూడెం నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లేనినా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ దివ్యాంగులు వారి తెలివితేటలతో, వారి సామర్థ్యాన్ని బట్టి పనులు చేసుకోని అన్ని రంగాలలో రాణించాలని, వారి దినచర్యలో భాగంగా ఈ సహాయ ఉపకరణాలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించాలని అన్నారు. గత అక్టోబర్ నెలలో జిల్లాలోని గుండాల, భద్రాచలం, అశ్వరావుపేట, ఐ.డి.ఓ.సి. పాల్వంచ ప్రదేశాలలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరము నిర్వహించడం జరిగింది. ఎంపికైన 440 మంది దివ్యాంగులకు 1057 సహాయ ఉపకరణాలు(విలువ 1.11 కోట్లు) పంపిణీ చేయడం జరిగింది. లబ్ధిదారులకు బ్యాటరీ ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు, సిపి చైర్స్, చంక కర్రలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పీ సీఈవో బి.నాగ లక్ష్మి ,డిఎంహెచ్వో భాస్కర్ నాయక్, సిడిపిఓ పద్మశ్రీ, ఐ.ఈ.డి శ్రీరామ్, టి.వి.పి.ఎస్. అధ్యక్షుడు సతీష్, డి.సి.పి.ఓ.హరి కుమారి, సఖి అడ్మిన్ శుభ శ్రీ, హబ్ కోఆర్డినేటర్ రూప, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సందీప్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బంది వరప్రసాద్, నరేష్, ప్రవీణ్, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మందుల కొరత AITUC ఆధ్వర్యంలో ధర్నా

**మంచిర్యాల జిల్లా ప్రజాతీర్పు ప్రతినిధి వి వెంకటేష్ జూన్ 9**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో కార్మికులకు అవసరమైన సరిపడ మందుల సరఫరా చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి సింగరేణి ఏరియా హాస్పిటల్ ముందు ధర్నా చేశారుఈ సందర్భంగా సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి కార్యదర్శులు ఎన్ తిరుపతి దాగ మల్లేష్ మాట్లాడుతూ: సింగరేణి సంస్థలు కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నెలకు సరిపడే మందులు ఇవ్వాల్సి ఉండగా రెండు నెలలుగా మందుల సరఫరా లేని కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని అందుకు కారణం సింగరేణి యాజమాన్యం వైఫల్యమే అని అన్నారు. ప్రభుత్వ రంగ సమస్త సింగరేణిలో వేలకోట్లు లాభాలు అర్జిస్తున్న కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు పదవి విరమణ కార్మికులకు ప్రతినెల దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులు అందడం లేదని మండిపడ్డారు గత రెండు నెలలుగా పూర్తిస్థాయిలో మందులు సరఫరా లేక కార్మికులు రిటైర్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు ఆసుపత్రిలో నెలకొన్న మందుల కొరత పలు దఫాలుగా యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లిన నేటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు ఔషధాలు పూర్తిస్థాయిలో సరఫరా లేకపోవడం వల్ల నెలకు ఇవ్వాల్సిన ఔషధాలను పది రోజులకు కుదించి ఇస్తున్నారని వెల్లడించారు దీనివల్ల సరిపడా మందులు అందక కార్మికులు అనారోగ్య బారిన పడుతున్నారని మండిపడ్డారు దూర ప్రాంతాల నుండి పదవి విరమణ పొందిన కార్మికుడు పది రోజులకోసారి ఐదు రోజులకో సారి మందులు ఇస్తున్నారని తెలిపారు దీనివల్ల కార్మికులు పదవి విరమణ పొందిన కార్మికులు తీవ్ర ఇబ్బందులకు ఆందోళనలకు గురవుతున్నారని అన్నారు ఇప్పటికైనా సింగరేణి యజమాన్యం వెంటనే స్పందించి మందులను పూర్తిస్థాయిలో అందే విధంగా చర్యలు తీసుకోని కార్మికులకు అంది ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు అనంతరం సింగరేణి ఏరియా హాస్పిటల్ డివైసీఎం డాక్టర్ మధు కుమార్ కు గుర్తింపు సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో ఏరియా సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ భయ్యా మొగిలి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ హాస్పటల్ బిట్స్ కార్యదర్శి దాసరి రాజా శ్రీధర్ మీనుగు లక్ష్మీనారాయణ రత్నం ఐలయ్య పద్మ దాసరి జ్యోతి మారం శ్రీనివాస్ మంతెన రమేష్ ఎస్ నాగేశ్వరరావు కొండపల్లి నర్సయ్య ఐ సంపత్ అన్వేష్ దాడి రమేష్ మంతెన భాస్కర్ రత్నం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

## మహిళ పట్ల ఆసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు....

**( ప్రజా తీర్పు ప్రతినిధిజమ్మికుంట ): జూన్: 9: సోమవారం:**

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు. పోలీసులు, తెలిపిన వివరాల ప్రకారం తేదీ (8-6-2025) ఆదివారం రోజున మహమ్మద్ ముస్కాన్ అనే మహిళ బిజిగిరి షరీఫ్ లో జరిగే ఉర్సు ఉత్సవానికి హైదరాబాదు నుండి తన కుటుంబంతో కలిసి వచ్చి దర్శనం ముగించుకొని తన చెల్లెలుతో కలిసి ఐస్ క్రీమ్ తినడానికి వెళ్తే అక్కడ మహమ్మద్ అబ్దుల్ నయీమ్ అనే వ్యక్తి తనని వెంబడిస్తూ సైగలు చేస్తూ.. అసభ్యకరంగా ప్రవర్తించి ఇబ్బందులకు గురిచేసినాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీ.ఐ .సుదగాని రామకృష్ణ గౌడ్. తెలిపారు.



## మహేశ్వరం నియోజకవర్గంలో పర్యటించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు శివరాజ్ సింగ్ చౌహాన్

**(మహేశ్వరం నియోజకవర్గ ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

మహేశ్వరం మండల్ మన్సాన్ పల్లి గ్రామం మరియు రామచంద్రగూడ గ్రామాలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ లో భాగంగా వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించడానికి మరియు స్థానిక రైతులతో సంభాషించడానికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు శివరాజ్ సింగ్ చౌహాన్ గారు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గారి తో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారు, రంగారెడ్డి రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ గారు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు, గారు మాజీ జిల్లా అధ్యక్షులు బొక్కా నరసింహారెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్, పార్లమెంట్ కో- కన్వీనర్ అనంతయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు యాదిష్ తదితరులు పాల్గొన్నారు.

# కోడెలను వ్యవసాయ అవసరాలకే వినియోగించాలి::కలెక్టర్

**తిప్పాపూర్ గోశాలలో కోడెల 100 జతల పంపిణీ**

**ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్,వేములవాడ, జూన్ 09**



గోశాల లో పంపిణీ చేసే కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. సోమవారం సాయంత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో దరఖాస్తు చేసుకున్న రైతులకు 100 జతల కోడెలను 200 జీవాలను అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కోడెల స్థితిగతులపై ఆరా తీస్తారని తెలిపారు. కోడెలను పొందిన రైతులు వాటి సంరక్షణ బాధ్యతను పక్కాగా చూడాలని సూచించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో వినోద్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం పశు వైద్యాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పాఠశాలల విలీనం మానుకోవాలి

**డీ.టీ.ఎఫ్. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి .రాజిరెడ్డి...**

**(ప్రజా తీర్పు ప్రతినిధిజమ్మికుంట ) : జూన్: 9: సోమవారం:**




ప్రభుత్వం పాఠశాలల విలీనం మానుకోవాలని డి.టి.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి రాజిరెడ్డి అన్నారు. సోమవారం రోజున కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల కేంద్ర%శీ%లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జమ్మికుంట మండల శాఖ ఆధ్వర్యంలో డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు వేణుమాధవ్ అధ్యక్షతన సెలవు నిబంధనలు ప్రభుత్వ ఉత్తర్వుల మీద అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాఠశాల నిర్వహణపై రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘుశంకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి రాజిరెడ్డి మాట్లాడుతూ సెలవు నిబంధనలు ప్రభుత్వ ఉత్తర్వుల మీద సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను మూసివేత దిశగా ఆలోచనలు చేస్తున్న ప్రభుత్వం అందులో భాగంగానే పాఠశాలలను కుదించాలనే కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది నిరుపేద ఎస్.సి, ఎస్.టి , బలహీన వర్గాలకు చెందిన పిల్లలని వారికి సమానమైన, నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత అని అందుకోసం ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఐదు తరగతులతో పాటు ఐదుగురు టీచర్లను నిరమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శి రాంమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శులు తిరుపతి, చక్రధర్, జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ , ఇల్లందకుంట అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంపత్, వేణు, రాగిణి, లహరి అనూష , ప్రవీణ, హరీష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేసిన శ్రీరాములు అందెల

(మహేశ్వరం నియోజకవర్గ ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఈరోజు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు గారు మహేశ్వరం నియోజకవర్గంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను గుర్తించాలని, అలాగే అనుమతులు లేకుండా నడిపిస్తున్న మదర్సాలను తొలగించాలని మరియు ప్రైవేట్ విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అక్రమంగా నోట్ బుక్స్ మరియు యూనిఫామ్ లు తల్లిదండ్రులకు అమ్ముతున్నారని...వీటి అన్నిటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి గారిని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ గడ్డం లక్ష్మా రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, జక్కిడి మధుసూదన్ రెడ్డి, ఎల్చల భాస్కర్ రెడ్డి, నిమ్మల రవికాంత్ గౌడ్, సురేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.



## మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అన్యాయం.

ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి దండే భూమన్న 09.జూన్

నస్పూర్ గ్రామంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 56% బీసీ జనాభా ఉంటే మంత్రివర్గంలో కేవలం ముగ్గురికి మాత్రమే అవకాశం కల్పించడం బాధాకరం గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ముగ్గురికి అవకాశం కల్పించింది కాంగ్రెస్ ప్రజా పాలనాని కాంగ్రెస్ తోనే సామాజిక న్యాయం జరుగుతుందని గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వం ఒకపక్క మా జనాభా ఎంతో మా వాటా అంత కావాలని ఉద్యమాలు నడుస్తున్నప్పటికీ మా న్యాయమైన వాట ఇవ్వకపోవడం అంటే ఇది బీసీలపై వివక్షగా భావిస్తున్నాం బీసీ జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలో 9 మంది బీసీ మంత్రులుగా ఉండవలసిన స్థానంలో కేవలం ముగ్గురే అంటే ఇంతకన్నా వివక్ష మరొకటి లేదు దేశంలోనే కులగనన విషయంలో తెలంగాణ రాష్ట్రం రోల్ మోడలని గొప్పగా చెప్పిన కాంగ్రెస్ రాష్ట్రంలో 56% బీసీ జనాభా అని ప్రకటించిన ప్రభుత్వం మరి జనాభా ప్రాతిపదికన మంత్రివర్గంలో ఎందుకు స్థానం కల్పించడం లేదు బీసీ సమాజానికి చెప్పవలసిన బాధ్యత ఉన్నదని తెలియజేస్తూ ఇప్పటికైనా బీసీలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం, ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జిల్లా అధ్యక్షులు, గుమ్మల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, శాఖపురి భీమ్ సెన్, బోడంకి కుమార్, గగ్గూరి రాజన్న, ఎర్రోళ్ల రాజు, పానెం పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభతో అలరించిన హిందూ దేవాలయం

### వేదోక్తంగా జరిగిన విగ్రహ ప్రతిష్టాపన

( ప్రజాతీర్పు ప్రత్యేక ప్రతినిధి )

వేల్వేల్ మురుగగా విట్ర వేలు మురుగా, విట్రవేల్ మురుగన్ కి హరోమ్ హారా... అంటూ పరవశించిపోయిన భక్తులు, అర్చక స్వాముల వేదమంత్రో చ్చారణ, కేరళకు చెందిన చెండా వాయిద్యం , గణ గణ గంటారావ%శీ%, పంచామృత , తైలాభిషేకం తో అమెరికా టెక్సాస్ రాష్ట్రంలోని ఫోర్ట్ వర్త్ హిందూ దేవాలయం పరవశించింది. భక్తులు పులకించారు. అంగరంగ వైభవంగా మూడు రోజుల పాటు కన్నుల పండుగలా జరిగిన నవగ్రహ,శ్రీవల్లి దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ప్రాణ ప్రతిష్టా మహోత్సవ%శీ% వైభవంగా జరిగింది. శుక్రవారం ప్రారంభమైన ప్రతిష్టా కార్యక్రమంలో భాగంగా గణపతిపూజ,పుణ్యాహవాచన%శీ%, సర్వతోభద్ర మండల స్థాపన యోగినీ దేవి స్థాపన , ప్రాసాధ వాస్తు స్థాపన , శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహారాధన, అరణీ మంతనం, అష్టగణపతి స్థాపన, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి అష్టదిక్ పాలకస్థాపన,నవగ్రహస్థాపన వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. తమిళనాడు నుండి



తెప్పించిన శ్రీవల్లి దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి నవగ్రహ దేవతల విగ్రహాలకు ధాన్య ఫల జల పుష్ప ధన శయానాధివాస కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. క్రతువులో భాగంగా గణేష నవగ్రహ సుబ్రహ్మణ్య హెూమం నిర్వహించారు. అనంతరం జరిగిన ఉత్సవ మూర్తుల శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్టానంతరం గో దర్శనం , అశ్వదర్శనం కన్య బాల సుమంగళి బ్రహ్మచారి సన్యాసి దర్శనం జరిగింది. దర్శనానంతరం కూష్మాండబలి మంత్రపుష్ప%శీ% నృత్యం సంగీతం చతుర్వేద మంత్ర పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చక స్వాములు మురళి కృష్ణమాచార్య నేతృత్వంలో హేమంత్ ఆచార్య, ధృవ్ రావల్ ఈ ఆధ్యాత్మిక ప్రతిష్ట కార్యక్రమాన్ని వేదొక్తంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీలు , నిర్వహణ కమిటీ సభ్యులు సుభాషిని సుబ్రమణ్యం రెడ్డి బోయ లక్ష్మీ వెంకటేశ్వరరావు నంబూరు మురళీ వెన్నం రన్నాజాని భాస్కర్ పబ్బా అరవింద్ నాన కిరీట్ పటేల్ ఉదయ్ దేశాయ్ పూర్ణిమా పటేల్ సురేంద్ర బిక్కి రాధాకృష్ణన్ రవీంద్రన్ సచ్చిదానందం దేవదాసు త్రినాథ రావు కూచిబట్ల సాయి గొట్టిముక్కల వెంకట విశ్వనాథ్ తదితరులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి చిదానంద ఆధ్యాత్మిక ప్రవచనం గావించారు. అనంతరం భక్తులకు మహదాశీర్వచనం తీర్థప్రసాద వితరణ అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ప్రతిష్ట మహెూత్సవ%శీ% జయప్రదం గావించారు.

## ఆన్లైన్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకొని, యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య..

ప్రజా తీర్పు ప్రతినిధి సిరిసిల్ల స్టాపర్ తంగళ్ళపల్లి జూన్ 9



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం దేసయ్ పల్లె గ్రామానికి చెందిన తుమ్మల వంశీ(20) అను అతడు ఇంటర్మీడియట్ పూర్తి చేసి, కార్ మెకానిక్ షాపులో పనిచేస్తున్నాడు. మృతుడు గత మూడు సంవత్సరాల నుండి ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్ ఆడుతున్నాడు.దీని ద్వారా సుమారు పది లక్షల రూపాయలు పోగొట్టినాడు.అలాగే మృతుడు తన స్నేహితుల వద్ద, తెలిసిన వారి వద్ద నుండి అప్పులు చేసి ఆన్లైన్ గేమ్ లో డబ్బులు పెట్టి పోగొట్టినాడు.ఇటి విషయం ఇంట్లో తెలిసి కుటుంబ సభ్యులు మందలించి నందుకు ఈరోజు అనగా తేదీ:-9.6.2025 రోజున ఉదయం 11:20 గంటలకు పొలం వద్దకు వెళ్లి తన పొలంలో ఉన్న చెట్టుకు తాడుతో ఉరివేసుకొని చనిపోయినడు అని మృతుని యొక్క తండ్రి అయిన తుమ్మల శ్రీనివాస్, తండ్రి నర్సయ్య అనువతడు పోలీస్ స్టేషన్లలో దరఖాస్తు ఇవ్వగా ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపినారు.

## బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దాం

### జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్

ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి దండే భూమన్న జూన్ 9, 2025:



జిల్లాలో బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్స్ తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టకూడదు అని, ఎవరైతే 18 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయించి నట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా బాల కార్మికులు పని చేస్తున్నట్లు కనిపిస్తే ఉచిత నెంబర్ 1098 లో సమాచారం అందించాలని, అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎల్ ఓ. రామ్మోహన్, డిసిపిఓ ఆనంద్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్స్ పాల్గొన్నారు.




## ఏది హిట్టు.. ఏది ఫ్లాప్.. వేదాంతం చెబుతున్న పూజా హెగ్డే

ఆ మధ్య సౌత్ నార్త్ ఇండస్ట్రీల్లో సూపర్ ఫామ్‌లో కనిపించిన పూజా హెగ్డే సడన్‌గా స్లో అయ్యారు. వరుస ఫెయిల్యూర్స్‌తో కెరీర్ ఇబ్బందుల్లో పడేసుకున్నారు. దీంతో అవకాశాలు కూడా చేజారాయి. ఇప్పుడిప్పుడే మళ్లీ ఫామ్‌లోకి వస్తున్న ఈ బ్యూటీ, తన సక్సెస్ ఫెయిల్యూర్స్ గురించి ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. ఒకప్పుడు పాన్ ఇండియా హీరోయిన్‌గా ప్రూవ్ చేసుకుంటారనుకున్న పూజ హెగ్డే సడన్‌గా స్లో అయ్యారు.ఒకప్పుడు పాన్ ఇండియా హీరోయిన్‌గా ప్రూవ్ చేసుకుంటారనుకున్న పూజ హెగ్డే సడన్‌గా స్లో అయ్యారు. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన సినిమాలు కూడా డిజాస్టర్స్ కావటంతో అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో కొంత కాలం ఫిలిం సర్కిల్స్‌లో పూజ పేరే వినిపించలేదు.దేవా సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీకి ఆ సినిమా కూడా ఆశించిన స్థాయి సక్సెస్ ఇవ్వలేదు. రీసెంట్‌గా రెట్రో సినిమాతో సక్సెస్ దక్కినా... పెద్దగా బజ్ అయితే రాలేదు. అందుకే సక్సెస్ ఫెయిల్యూర్ల విషయంలో వేదాంతం మాట్లాడుతున్నారు బుట్టబొమ్మ. కెరీర్‌లో ఫెయిల్యూర్స్‌ను యాక్సెప్ట్ చేయాలంటున్నారు ఈ బ్యూటీ. అలా అంగీకరిస్తేనే... కొత్తగా ప్రేక్షకులకు అలరించే అవకాశం ఉంటుందన్నారు. కెరీర్‌లో ఎత్తు పల్లాలు అందరికీ ఉంటాయంటూ పెద్దరికంగా మాట్లాడుతున్నారు. మరి అనుభవం ఆమె కెరీర్‌కు ఎంత వరకు హెల్ప్ అవుతుందో చూడాలి.ప్రజెంట్ అరవింద్ చేతిలో క్రేజీ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. విజయ్ ఆఖరి చిత్రం జననాయగన్‌లో హీరోయిన్‌గా నటిస్తున్నారు ఈ బ్యూటీ. బాలీవుడ్‌లో వరుణ్ దావన్ హీరోగా తెరకెక్కుతున్న సినిమాకు ఓకే చెప్పారు. మరికొన్ని ప్రాజెక్ట్స్ డిస్కషన్ స్టేజ్‌లో ఉన్నాయి.



## కమల్ హాసన్‌కు మరో ఎదురు దెబ్బ.. 'థగ్ లైఫ్' సినిమాపై ఝలక్ ఇచ్చిన సుప్రీం కోర్టు

లోకనాయకుడు కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్' సినిమా కర్ణాటకలో విడుదల కాలేదు. కన్నడపై ఆయన చేసిన వివాదాస్పద ప్రకటన కారణంగా ఈ సినిమాను కన్నడిగులు వ్యతిరేకించారు. ప్రస్తుతం ఈ కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ కమల్ మళ్లీ సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. 'థగ్ లైఫ్' సినిమాపై కర్ణాటకలో నిషేధం కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. అయితే ఈ నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ నటుడు కమల్ హాసన్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. కోర్టు ద్వారా కేసును పరిష్కరించడానికి ఆయన శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఈ పిటిషన్ హైకోర్టులో విచారణలో ఉండగానే కమల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే అక్కడ కూడా లోక నాయకుడికి ఎదురుదెబ్బ తగిలింది. పిటిషన్ పై సోమవారం (జూన్ 09) విచారణ జరిపిన భారత అత్యున్నత న్యాయస్థానం ఇప్పుడీ పిటిషన్ పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని, హైకోర్టు తీర్పు చెప్పే వరకు వేచి ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా 'కన్నడ తమిళం నుంచి పుట్టింది' అని కమల్ హాసన్ చేసిన ప్రకటనపై కన్నడిగులు తీవ్రంగా మండిపడుతున్నారు. దీని కారణంగా, ఆయన నటించిన 'థగ్ లైఫ్' సినిమాను కర్ణాటకలో విడుదల చేయకూడదని నిర్ణయించారు. అయితే దీనిపై కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు కమల్. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు సినిమాను విడుదల చేయడం అసాధ్యమని పేర్కొంది. కన్నడ ప్రజలు క్షమాపణ చెబితేనే సమస్య పరిష్కారం అవుతుందని కోర్టు పరోక్షంగా సూచించింది. ప్రస్తుతం ఈ పిటిషన్ జూన్ 10న విచారణకు రానుంది. అయితే అంతకు ముందు కమల్ హాసన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు అక్కడ కూడా కమల్ కు ఎదురుదెబ్బ తగిలింది.



'కర్ణాటకలో థగ్ లైఫ్ కు వ్యతిరేకంగా బెదిరింపులు వస్తున్నాయి. ఈ సినిమాను ప్రదర్శించడానికి అనుమతి లేదు" అని ఆ బృందం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ ను విచారించడానికి జస్టిస్ పికె మిశ్రా నిరాకరించారు. పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించాలని ఆదేశించారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020